V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..


సోమవారం
21-10-2024

సంపుటి : 01 | సంచిక : 169 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







# గ్రూప్-1 మంటలను సుప్రీం తీర్పు చల్లార్చేనా?



## రాజకీయ రంగు పులుముకున్న జీవో 29
## గందరగోళంలో గ్రూప్ వన్ అభ్యర్థులు
## గ్రూప్ వన్ మెయిన్స్ నిర్వహణపై వెనక్కి తగ్గని ప్రభుత్వం
## నేటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు.. నేడే సుప్రీం తీర్పు కూడా



జీవో 29 వివాదం ముందుకు వచ్చి రాజకీయ రంగు పులుముకుని కోర్టుకెక్కింది. "మనం ఎంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నామో అన్న మాట చెప్పుకోవడానికి గ్రూప్-1 నిర్వహణ ఒక మచ్చుతునక. గత ప్రభుత్వంలో వాయిదాల మీద వాయిదాలు పడి.. సుప్రీం కోర్టు ఆదేశాలతో రద్దయ్యింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సక్రమంగా జరుగుతుందా అనుకుంటే జీవో 29 రూపంలో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. ఈనేపథ్యంలో హైకోర్టు ఆదేశాలతో సోమవారం నుంచి గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అదే సమయంలో ఈరోజునే సుప్రీం కోర్టు 29 జీవోపై తీర్పు వెలువరించనుంది. ఈనేపథ్యంలో ఒక పక్క హై కోర్టులో ఊరట రాని రిజర్వుడ్ కేటగిరీ విద్యార్థులు సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. మరోపక్క మెయిన్స్ కు ఎంపికైన అభ్యర్థులను సోమవారం పరీక్ష జరుగుతుందా? జరగదా? తీరా పరీక్షకు బయలుదేరి వెళ్ళాక సుప్రీం కోర్టు పరీక్షను రద్దు చేస్తే/ వాయిదా వేస్తే ఎట్లా? వంటి ప్రశ్నలు వేధిస్తున్నాయి. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. ప్రాక్టికల్ గా సమస్యలు ఉన్నప్పుడు ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అవసరమా?" అని విద్యావేత్తలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్ వన్ మెయిన్స్ గందరగోళంపై విశ్వంభర ప్రత్యేక కథనం..

### జీవో 29ను రద్దు చేయాలి: అభ్యర్థులు

తెలంగాణ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని.. జీవో 29ను రద్దు చేయాలని.. అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మరోపక్క కోర్టుల్లో కేసులు వేస్తున్నారు.జీవో 29ను రద్దు చేసి పాత జీవో 55 ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జారీచేసిన జీవోతో తమకు అంటే రిజర్వుడు కేటగిరీల్లోని అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని వీళ్ళు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 ప్రకారం..రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మెయిన్స్‌లో మెరిట్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఉద్యోగాల కేటాయింపులోనే రిజర్వేషన్లు వర్తింపు జేస్తారు. అందువల్ల ఓపెన్ కేటగిరీలో ఎంపికైన రిజర్వుడు అభ్యర్థులను కూడా రిజర్వేషన్ కేటగిరీ కిందనే పరిగణిస్తున్నారు. దీనివల్ల రిజర్వ్ డ్ కేటగిరీలో ఉన్నవారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని అభ్యర్థుల వాదన.రిజర్వుడ్ అభ్యర్థులకు సంబంధించి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఈ జీవోను తీసుకువచ్చిందని ఆరోపిస్తున్నారు అభ్యర్థులు. ఈనెల 21వ తేదీ నుండి 27 వరకు జరగబోయే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను ఎలాగైనా సరే జరగకుండా చేయాలని ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం లేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తమ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకూ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

-పోతుగంటి వెంకటరమణ,
న్యూస్ నెట్‌వర్క్ ఇంఛార్జి, బ్యూరో చీఫ్ (వీ3 న్యూస్, విశ్వంభర)

### జీవో 55 ద్వారా 563 పోస్టులకు 28,153 మెయిన్స్ కు ఎంపిక...

గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 55లో 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ క్రమంలో 40 శాతం అభ్యర్థులను మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తే.. 60 శాతం అభ్యర్థుల ఎంపికలో రిజర్వేషన్లను వర్తింపు చేస్తారు. దీంతో మెరిట్ ఉన్న రిజర్వుడు అభ్యర్థులు ఓపెన్ కోటాలో ఎంపికవుతారు. మెరిట్ తక్కువ ఉన్న అభ్యర్థులకు..రిజర్వుడు కేటగిరిలో అవకాశం లభిస్తోంది. దీనివల్ల అటు ఓపెన్ కోటాలోనూ..ఇటూ రిజర్వుడు కోటాలో కూడా రిజర్వేషన్లు ఉన్న అభ్యర్థులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రభుత్వం భర్తీచేయాలని అనుకున్న గ్రూప్-1 పోస్టులు 563. ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్(టీజీపీఎస్సీ) ఎంపికచేసింది. దీని ప్రకారం గ్రూప్-1 563 పోస్టులకు 28,153 మందిని మెయిన్స్ పరీక్షలకు ఎంపికచేశారు. అయితే అప్పట్లో నిర్వహించిన పరీక్షల ప్రశ్నల్లో తప్పులు రావటంతో కోర్టుల్లో కేసులు పడ్డాయి. దాంతో విచారణ బాగా జాప్యం జరిగి చివరకు ఒక్కపోస్టును కూడా కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేయలేకపోయింది. 2023లో భర్తీకి ప్రయత్నాలు జరిగినా ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం 2022లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను కోర్టు తీర్పుతో రద్దు చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ఆ సమయంలో కొత్త నోటిఫికేషన్‌ను జారీ చే స్తూ . . జీ వో 29ను తీసుకు వచ్చింది.

## గ్రూప్-1 అభ్యర్థుల అడ్డాగా అశోక్ నగరే ఎందుకైంది?



చాలామందిని ఆశ్చర్యపరుస్తున్న విషయం ఒకటుంది. అదేమిటంటే గ్రూప్-1,2 పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు ఆందోళనలు చేయాలంటే అశోకనగర్ అడ్డాగా పాపులరైపోయింది. ఎప్పుడు ఈ అభ్యర్థులు ఆందోళనలు చేయాలన్నా నిముషాల వ్యవధిలో వేలాదిమంది అభ్యర్థులు ఎలా జమవ్వగలుగుతున్నారు ? గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనలకు ప్రభుత్వమే షేకైపోతోంది. ప్రతిపక్షాలు తప్పనిస్థితిలో వీళ్ళకు మద్దతుగా నిలవాల్సొస్తోంది. దీనికి కారణం ఏమిటంటే చాలా సింపుల్ నిముషాల వ్యవధిలోనే వేలదిమంది జమైపోవటం. ఇంత తొందరగా అన్ని వేలమంది ఎలా అశోక్ నగర్లో జమవుతున్నారు? దీనికి కారణం ఏమిటంటే.. సాఫ్ట్ వేర్ కోర్సులు చేయాలంటే అమీర్ పేట, డీఎస్సీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవాలంటే దిల్ షుఖ్ నగర్ ఎంతటి పాపులరో గ్రూప్స్ పరీక్షల కోచింగ్ సెంటర్లకు అశోక్ నగర్ అంతే పాపులర్.అశోక్ నగర్ గ్రూప్-1,2 పరీక్షలు రాసే అభ్యర్థుల కోచింగ్ సెంటర్లకు బాగా పేరుపడింది. చిన్నా, పెద్దా కోచింగ్ సెంటర్లు అశోక్ నగర్లో సుమారు 200 దాకా ఉన్నాయి. ఒక్కో సెంటర్లో తక్కువలో తక్కువ 400 మంది కోచింగ్ తీసుకుంటుంటారు. 'ఈ సెంటర్లలో 50వేల నుండి 60 వేలమంది విద్యార్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. కోచింగ్ సెంటర్లలో చదువుతున్న వాళ్ళు కాకుండ చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీకి గ్రూప్స్ పరీక్షల మెటీరియల్ చదువుకునేందుకు ప్రతిరోజు కొన్ని వందలమంది వస్తుంటారు. గ్రూప్-1,2 కోచింగ్ విద్యార్థులే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్ లాంటి యూపీఎస్సీ రాసే విద్యార్థులు కూడా కొన్ని వేలమంది ఉంటారు. యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతునే గ్రూప్-1 పరీక్షలు రాసే విద్యార్థులు వేలల్లో ఉంటారు. యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చే సెంటర్లు కూడా చాలానే ఉన్నాయి. 'అశోక్ నగర్లో కోచింగ్ తీసుకోవటమే కాకుండా అశోక్ నగర్, చిక్కడపల్లి ఏరియాల్లోని హాస్టళ్ళల్లోనే వేలాదిమంది విద్యార్థులు ఉంటున్నారు. ఈ లెక్కన చూసుకుంటే పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయని అభ్యర్థులు అనుకుంటే, ఆందోళనలు చేయాలని నిర్ణయిస్తే ఒకచోట కలవటం వీళ్ళకు చాలా తేలికవుతోంది.'కోచింగ్ సెంటర్లే కాకుండా హాస్టళ్ళు కూడా ఈ ప్రాంతాల్లోనే ఉండటం వల్ల తక్కువ సమయంలోనే వేలాదిమంది అభ్యర్థులు ఒకచోట చేరుతున్నారు. బయట ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి, ఎంజీబీఎస్ నుండి అశోక్ నగర్ చేరుకోవటం చాలా తేలిక. పైగా గ్రూప్స్ పరీక్షలు రాసేవారికి ఎలాగూ మొబైల్ ఫోన్లుంటాయనటంలో సందేహంలేదు. కాబట్టి సమాచారం ఇచ్చిపుచ్చుకోవటం కూడా తేలిక అయిపోయింది. వాట్సప్, టెలిగ్రామ్ యాప్ ద్వారా గ్రూప్ కాల్స్ మాట్లాడుకోవటం, మెసేజీలు పంపుకోవటం తేలికైపోయింది. దాంతో ఏ సమాచారమైనా నిముషాల్లో అభ్యర్థుల మధ్య చాలా తేలికగా సర్క్యులేట్ అయిపోతోంది. సమాచారం అందటమే ఆలస్యం నిముషాల వ్యవధిలో కొన్ని వేలమంది ముందుగా నిర్ణయించుకున్న సెంటర్ దగ్గరకు చేరుకునేస్తున్నారు.

### అభ్యర్థుల భయం ఇదీ...

కేసీఆర్ ప్రభుత్వంలో జారీ అయిన జీవో 55 ప్రకారం పరీక్షలు రాయబోయే 28,160 మంది అభ్యర్థుల్లో 14 వేలు-14వేలుగా విభజన జరిగింది. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం జారీచేసిన జీవో 29 వల్ల 14వేలు:14వేలు కాస్త 14వేలు: 19వేలుగా మారిపోయింది. పెరిగిపోయిన 5 వేలమంది కచ్చితంగా ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులే అన్న విషయాన్ని ఆందోళనకారులు తట్టుకోలేకపోతున్నారు. ఇదే దామాషాలో మెయిన్స్ పరీక్షలు పాసైన తర్వాత ఇంటర్వ్యూలకు కూడా ఎంపిక అయి తమకు దక్కాల్సిన ఉద్యోగాల్లో ఓసీ క్యాటగిరి అభ్యర్థులే ఎక్కువ ఉద్యోగాలను తన్నుకుపోతారన్నది ఆందోళనకారుల భయం. అందుకనే వెంటనే జీవో 29ని రద్దుచేసి తమకు న్యాయంచేయాలని ఆందోళనకారులు సుప్రింకోర్టులో కేసు వేసింది.

### గ్రూప్ 1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల పరిస్థితి ఇదీ..

గ్రూప్ వన్ కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు మొక్కవోని దీక్షతో సివిల్స్ కు ప్రిపేర్ అవుతోనే గ్రూప్-1 కోసం కూడా చదివారు. 14 ఏళ్ల తర్వాత వచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ వారిని ఉత్సాహపరిచింది. అందులో వంద డీఎస్పీ పోస్టులు ఉండడంతో దాని మీద సహజంగానే దృష్టిపెట్టారు. గ్రూప్-1 లో ముందుగా విజయం సాధించి డీ ఎస్పీ అయితే బాగుంటుందని అన్ని సబ్జెక్టులతో పాటు పరీక్షకు అనుగుణంగా తెలంగాణ చరిత్ర అవపోసన పట్టారు. వివిధ కారణాల వల్ల మూడు సార్లు ప్రిలిమ్స్ రాయాల్సి రావడం నిరాశ పరిచింది. అయినా కొందరు ప్రిలిమ్స్ లో విజయం సాధించారు..



ఉత్తమమైన కోచింగ్ ఇప్పించడం కోసం కొంతమంది కుటుంబాలు హైదరాబాద్ కు మకాం మార్చినవారున్నారు.. అశోక్ నగర్ లో రాత్రిబగల్లు మెయిన్స్ కోసం కుస్తీ పడుడుతున్నారు. ఈనేపథ్యంలో 29 జీవో గందరగోళంతో ఇబ్బందులు పడుతున్నారు.

### నేడు సుప్రీం తీర్పు ఎలా ఉండబోతోంది..

నేట మధ్యాహ్నం 2.30 గంటలనుండి గ్రూప్-1 పరీక్షలు మొదలవుతుండగా అదేరోజు ఉదయం 10.30 గంటలకు సుప్రీంకోర్టు జీవో 29 రద్దు కేసును విచారించబోతోంది. నిరుద్యోగుల డిమాండులో న్యాయం ఉంది కాబట్టి జీవో 29ని రద్దు చేసి పరీక్షలను రీ సెడ్యూల్ చేయాలని సుప్రీంకోర్టు చెబుతుందా ? లేకపోతే పరీక్షలు మొదలైన తర్వాత రద్దు చేయటం సాధ్యంకాదు కాబట్టి జీవో 29 ప్రకారమే పరీక్షలు రాయాలని చెబుతుందా అన్నది ఆసక్తిగా మారింది. మరి సుప్రీంకోర్టు ఏం చెబుతుందో చూడాలి మరీ.

### జీవో 29 ఉప సంహరించుకోవాలి బండి సంజయ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంతాలు, పట్టింపులకు పోకుండా జీవో 29ని ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. ఈ మేరకు ఆయన బహిరంగ లేఖ రాశారు. '' సోమవారం నుంచి పరీక్షలని తెలిసి కూడా ఆందోళనలు కొనసాగిస్తున్నారంటే అర్థం చేసుకోండి. నిరుద్యోగులంతా మీ కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆవేదన అర్థం చేసుకోండి. వెంటనే గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయండి. జీవో 29 వల్ల గ్రూప్-1 పరీక్షల్లో 5,003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారు. 563 పోస్టులకు 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయం. ఈ మొత్తం పోస్టుల్లో 354 రిజర్వు పోస్టులు. జీవో 29 వల్ల ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వ్ అభ్యర్థులను సైతం రిజర్వ్ కేటగిరిలో చేర్చడం అన్యాయం. ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే.. ఓసీ వర్గాలు 1:65శాతం మేర అర్హత సాధించాయి. జీవో 29 రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకం. గ్రూప్-1 అభ్యర్థులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. పరీక్షలు రీ షెడ్యూల్ చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నారు. జీవో 29 వల్ల రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థనే రద్దు చేయబోతున్నారనే చర్చ మొదలైంది. తక్షణమే జీవో 29 ఉపసంహరించుకోవాలి'' అని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.



### జీవో 29 ప్రకారమే పరీక్షలు ఉంటాయి: ప్రభుత్వం

అటు ప్రభుత్వం మాత్రం నిబంధనలపై వెనక్కి తగ్గేదే లేదంటోంది. జీవో 29 ప్రకారమే పరీక్షలు ఉంటాయని చెబుతోంది.హైకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో సోమవారం నుండి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరి బయోమెట్రిక్ తీసుకోనుండగా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రం తరలించే వాహనానికి తొలిసారిగా జీపీఎస్ వినియోగించనున్నారు. మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు.అభ్యర్థుల ఆందోళనలు తారస్థాయికి చేరడంతో పశ్నపత్రాల తరలింపు, పరీక్ష నిర్వహణ, తిరిగి జవాబు పత్రాలు తీసుకెళ్లడం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా గట్టి పోలీసు బందోబస్తు కల్పించాలని నిర్ణయించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఎస్.ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ విధుల్లో ఉంటారు. అదనంగా ఒక పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తుంటారు. భద్రతా పరమైన ఏర్పాట్ల పర్యవేక్షణకు మూడు కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు.



### రేవంత్, మహేందర్‌రెడ్డి కలిసి తప్పుడు జీవో తీసుకొచ్చారు: దాసోజు

సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా, మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. సీఎం, టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఇద్దరూ గ్రూప్1 అభ్యర్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ''జీవో 29తో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నోట్లో మట్టికొడుతున్నారు. బండి సంజయ్‌కు ఫోన్ చేసిన రేవంత్‌రెడ్డి గ్రూప్1 అభ్యర్థులను ఎందుకు కలవరు. గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయి. 60 ఉద్యోగాలు యాడ్ చేసి 563 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. రేవంత్, మహేందర్‌రెడ్డి కలిసి తప్పుడు జీవో తీసుకొచ్చారు. ఎవరి కోసం హడావుడిగా పరీక్షలు పెడుతున్నారు. ఎన్టీఆర్ కంటే రేవంత్‌రెడ్డి గొప్ప వ్యక్తి కాదు. ఇచ్చిన జీవోను 24 గంటల్లో ఎన్టీఆర్ వెనక్కి తీసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చే లోపు జీవోను రద్దు చేసి పరీక్షలు వాయిదా వేయాలి. రెండు నెలలు ఆలస్యం అయితే రేవంత్‌రెడ్డికి ఇబ్బంది ఏంటి? రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోంది'' అని దాసోజు శ్రవణ్ ఆరోపించారు.

### జీవో 29 వల్ల 5వేల మంది రిజర్వుడు అభ్యర్థులకు అన్యాయం

ఈ జీవో 29నే రద్దుచేయాలని ఇపుడు నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలు చేయడానికి కారణం ఏమిటంటే రేవంత్ ప్రభుత్వం జారీచేసిన జీవో 29 ప్రకారం రిజర్వేషన్ కేటగిరి అన్నదాన్ని తీసేశారు. 1:50 నిష్పత్తిలో మెయిన్స్ పరీక్ష రాయబోయే అభ్యర్థుల్లో 100 పోస్టులకు 5 వేలమందికి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నారు. మామూలుగా అయితే 5వేల మందిలో 2500 మంది రిజర్వుడు క్యాటగిరిల్లో, మిగిలిన 2500 మంది ఓపెన్ క్యాటగిరిలో ఉండాలి. కానీ జీవో 29 ప్రకారం మొత్తం 5 వేలమంది ఓపెన్ క్యాటగిరిలోనే మెయిన్స్ పరీక్షలు రాయాల్సుంటుంది. పరీక్షలు అయిపోయిన తర్వాత ఫలితాలు విడుదల చేసి ఉద్యోగాల భర్తీ సమయంలో రిజర్వేషన్ పాటిస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. జీవో 29 ప్రకారం ఓసీ క్యాటగిరిలోని అభ్యర్థులకే ఎక్కువ లాభం జరుగుతుంది. భర్తీ చేయాల్సిన పోస్టులు 563 ప్రకారం మెయిన్స్ పరీక్షలకు 28,160 మందికి అవకాశం రావాల్సుండగా 31,383 మందికి అవకాశం వచ్చింది. అంటే సుమారు 5 వేలమందికి పైగా ఓసీ క్యాటగిరి అభ్యర్థులకు లబ్ది జరుగుతోంది. ఓసీ క్యాటగిరి అభ్యర్థుల్లో 5 వేలమందికి పైగా లబ్ది జరుగుతోందంటే ఆ మేరకు రిజర్వుడు క్యాటగిరిల్లోని అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నట్లే. తమకు అన్యాయం జరుగుతోంది కాబట్టి జీవో 29ని రద్దుచేసి పరీక్షలను రీషెడ్యూల్ చేయటం ద్వారా తమకు న్యాయం చేయాలని గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రాయబోయే అభ్యర్థులు ఆందోళనలు చేస్తున్నారు.

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
21-10-2024
సంపుటి : 01 | సంచిక : 169 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## దక్షిణాదిలోనే అత్యాధునికంగా సికింద్రాబాద్ స్టేషన్

- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి
- హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

# ఎదగాలంటే రిస్క్ చేయాలి

### జీవితంలో రిస్క్ లేనిదే మంచి విజయాలు సాధించలేం

- ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యం
- ఐఎస్‌బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు
- ఎక్కడికి వెళ్లినా హైదరాబాద్, తెలంగాణ గురించే మాట్లాడండి
- 600 బిలియన్ డాలర్ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి కావాలి
- కష్టమే కానీ.. అసాధ్యం కాదు..
- ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



2

ప్రతి ఒక్కరి జీవితంలో కష్టం లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో ఆదివారం ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్‌లో ముఖ్యఅతిథిగా సీఎం హాజరయ్యారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని అన్నారు. ఐఎస్‌బీ విద్యార్థులు కొత్త ఇండియాకు అంబాసిడర్లు అని పేర్కొన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్లకు మార్చడమే తమ లక్ష్యం అన్నారు. హైదరాబాద్ ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలన్నారు. హైదరాబాద్ దేశంలోని నగరాలతో కాకుండా న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్ తో పోటీ పడాలని కోరుకుంటున్నట్లు సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచంలోని ప్రతీ భాగానికి తీసుకెళ్లడంలో మీ సహాయం కావాలి అన్నారు.




## పోలీసుల నిఘా నీడలో మెయిన్స్

గ్రూప్ 1కు హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు..

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

తొలిసారి జీపీఎస్ ట్రాకింగ్ విధానం అమలు

2



## గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

- 87మంది మృతి
- మృతుల్లో మహిళలు, చిన్నారులు
- ఇజ్రాయెల్ ప్రధాని ఇంటిపై డ్రోన్ దాడికి ప్రతీకారం

2

## టెంపోను ఢీకొన్న స్లీపర్ బస్సు

- 9 మంది చిన్నారులు సహా 12 మంది మృతి
- క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమం
- విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

2





## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 120 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 206 | ₹ 234 |

## చట్టబద్ధమైన వెంచర్లపై భయపడొద్దు

- సీఎం ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం
- హైడ్రా కీలక ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్:** రియల్ ఎస్టేట్‌కు భరోసా కల్పించేలా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా స్పందించింది. ఈ మేరకు కీలక ప్రకటన విడుదల చేసింది. మిగతా2లో...

## ఏఐ అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్

- 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు ప్రచారం
- 40 శాతం కూడా మాఫీ కాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


2





# ప్రశ్నించే గొంతుకలెక్కడ!?

**తెలంగాణ అంటే ప్రశ్నించే తత్వం కనిపించదేం?**



**తెలంగాణ రాష్ట్రం అంత ఆషామాషీగా రాలేదు. తెలంగాణ ఉద్యమం మొదలైన దగ్గర నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది అమరులను పోగొట్టుకొని ,ఆత్మ బలిదానాలను చేసుకొని, తుపాకీ గుండ్లకు ఎదురు నిలబడి ,సబ్బండ వర్గాలు కలిసి పోరాటం చేసి ,మా తెలంగాణ మాగ్గావలె అని కొట్లాడి తెచ్చుకున్నది కదా మన రాష్ట్రం. మరి గిప్పుడు ప్రశ్నించకుండా ఎందుకు మౌనం దాల్చుతుంది.? అనే ప్రశ్న సమాజంలో ఇప్పుడు గట్టిగా వినబడుతోంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పార్టీగా ఏర్పడి రాజకీయ పార్టీగా అధికారం దక్కించుకొని పది సంవత్సరాలు విజయవంతంగా పాలనను కొనసాగించింది. ఇదే సందర్భంలో ఎన్నో అపవాదులను , ఎన్నో అవమానాలను , ఎన్నో చీదరింపులను ఎదుర్కొంది. ఇక ఆ పది సంవత్సరాల కాలంలో ప్రశ్నించే గొంతుకలుగా సమాజంలో తెలంగాణ ప్రజలను నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ , ఆయా కుల సంఘాలు, ప్రజా సంఘాలు.. మౌనం దాల్చడం వెనక తెలంగాణ సమాజానికి ఏం మెసేజ్ వెళ్తుంది.!?**

నీళ్లు ,నిధులు ,నియామకాలు అని చెప్పిన మీరు ఎక్కడ పోయారు? అని ఆనాడు ప్రశ్నించిన ప్రొఫెసర్ కోదండరాం, కుల సంఘాలు ప్రజా సంఘాలు పలు సంఘాలన్నీ ఇవ్వాలా తమ గొంతుకు తాళం వేసుకొని మాట్లాడకుండా ఎందుకు మౌనం దాలుస్తున్నారు!? విద్యా కమిషన్ వేసిన తర్వాత ఒక్కసారి కూడా చైర్మన్ ఎక్కడ మాట్లాడిన దాఖలు కనిపించడం లేదు. గతంలో మాదిరిగా ప్రశ్నించే తత్వం చూపించలేదా!? మేధావులు మౌనం దాల్చడం ఈ సమాజానికి చేటు అని వట్టి మాటలే చెప్పుకుందామా!? కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే మేధావులు మౌనం దాలుస్తున్నారని ప్రశ్నిద్దామా!? పోరాడుదామా? కొట్లాడుదామా? కలబడుదామా? తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుందే భావితరాల భవిష్యత్తు కొరకు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు విద్య అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నా నాటి తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు విద్యార్థులకు అన్యాయం జరుగుతూనే ఉంది. పోరాటాలకే విద్యార్థులు ఉపయోగపడుతున్నారు కానీ విద్య, ఉపాధి అవకాశాలకు విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతూ వస్తోంది. ఒకవైపు పరీక్షల సమయం దగ్గరపడి ముంచుకొస్తుంటే ఇంకోవైపు లాఠీ చార్జీలు, పోలీసుల దెబ్బలకు విద్యార్థులు బలికావాల్సిందేనా!? చదువుకోవాల్సిన విద్యార్థులు పోరాట స్ఫూర్తితో, మానసిక రుక్మతితో బాధపడుతూ అన్యాయానికి గురవుతూ వస్తున్నారు. ఈ సమాజాన్ని బాగుపరచాలంటే విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండాలి విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగించాలి. కానీ ప్రజా ఆమోదయోగ్యంతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ప్రజాసంఘాలు ఏం చేస్తున్నాయి కుల సంఘాలు ఏం చేస్తున్నాయి ఆయా సంఘాలు మౌనం వహిస్తున్నాయా? ప్రభుత్వం పని చేయకపోతే ప్రశ్నించే మేధావులు ఎక్కడ పోయారు? మూడు సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన జి ఓ 29 ఇన్ని రోజులు సాగదీసి ఒక్కసారి దాన్ని తీసేస్తున్నాం అని చెప్పడం వెనక దాగిన రాజకీయ కుట్రలేమిటి? వెరసి విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ఎవరు పూడ్చగలరు? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇకనైన విద్యార్థుల గురించి ఆలోచించండి. ఒక్కసారిగా పరీక్షలకు సిద్ధం కండి , మానసిక రుగ్మతకు బలికాకండి అని సుమతీ శతకాలు వల్లిస్తే ఎట్లా? రెండు మూడు రోజులు ఉందనంగా ఇంత ఒత్తిడి తీసుకొచ్చి విద్యార్థులపై లాఠీచార్జి చేసిన ప్రభుత్వం ఏ ఉద్ధరించింది? నిజంగా ప్రశ్నించే గొంతుకలుగా తమ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకున్న తెలంగాణ పెద్దలు, కుల సంఘాలు , ప్రజాసంఘాలు మేధావులు మౌనం ఎందుకు దారుస్తున్నారు? ప్రశ్నించే తత్వాన్ని ఎందుకు సమాధి చేస్తున్నారు? నిజం అద్దాలమేడల్లో కునుకుతీస్తుందా? అబద్ధం అందలమెక్కి రాజ్యమేలుతున్నదా? అన్న ప్రశ్నలు సమాజంలో ఉత్పన్నమవుతున్నాయి. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ఒరిగింది ఏమిటి? విద్యార్థులతో రాజకీయ విన్యాసమా? తెలంగాణ అంటే ప్రశ్నించే తత్వం ఒకప్పుడు ఉండేది అని చరిత్రలో ఇక చదువుకోవాల్సిందేనా? మేధావుల మౌనం సమాజానికి చేటు అని తెలిసి కూడా ఎందుకు మౌనాన్ని దాలుస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో రాజకీయ జేఏసీగా రాజకీయ పార్టీలను ఒక్కతాటిపై నడిపిన ప్రజా సంఘాలు , కుల సంఘాలు , ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు..విద్యార్థుల గురించి మాట్లాడి ఉద్యమాలు నడిపించిన ఉద్యమకారులూ... మీరు మాట్లాడరేంటి? తెలంగాణ అస్తిత్వాన్ని పూర్తిగా ఎరిగి తెలంగాణ వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకొని తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఒక మంచి స్థానాన్ని ఏర్పరచుకున్న మేధావులైన సీనియర్లు ఎందుకు మౌనం దాలుస్తున్నారు? అని నిగ్గదీసి అడుగుతోంది తెలంగాణ సమాజం. 29 జీవో ప్రకటించినప్పటి నుంచి మౌనంగా ఉన్న ఇదే ముఖ్యమంత్రి ఒక్కసారిగా రెండు మూడు రోజులు పరీక్షలు నిర్వహిస్తున్న సందర్భంలో పోలీసులతో లాఠీ చార్జీలు చేయించడం వెనక రాజకీయ కుట్ర దాగి ఉందా? ప్రశ్నించాల్సిన మేధావులు అందలమెక్కి కూర్చున్న తర్వాత ఆ తత్వాన్ని మరిచిపోయి అధికార దాహంతో తనివి తీరా సేద తీర్చుకుంటున్నారా? అని ప్రశ్నిస్తుంది తెలంగాణ విద్యార్థి సమాజం! రాష్ట్రం సాధించుకున్న తొలి నాళ్లలో తమకు కావాల్సిన ప్రభుత్వం వచ్చింది అని సంబరపడ్డ ఆ క్షణం పూర్తిగా నీరుగారిపోయి బానిస బతుకుల కింద నలిగిపోతున్నాం అన్న పచ్చి నిజాన్ని తెలుసుకొని ప్రశ్నించే తత్వాన్ని తిరిగి లేవనెత్తి ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది ఈ పెద్దలే కదా. మరి నేడు ఏం జరుగుతోంది? ఒకవైపు విద్యార్థులు ఒళ్లంతా దెబ్బలు తలలకు గాయాలు పోలీసుల లాఠీలతో విద్యార్థుల జీవితాలు చితికి పోతుంటే.. ప్రశ్నించే పెద్దలు దాలుస్తున్న మౌనం వెనక రాజకీయ కుట్ర లేకపోలేదంటారా? ఏది ఏమైనా పది సంవత్సరాలలో అనేకమంది ప్రశ్నించిన సందర్భాన్ని మనం ఒక్కసారి జ్ఞాపకం చేసుకోవాలి. ఇక సోషల్ మీడియా వేదికగా ఎంతోమంది ఆనాడు ప్రశ్నించే తత్వాన్ని పుణికి పుచ్చుకొని నిర్భయంగా ప్రభుత్వం పాలనపై తిరగబడి ప్రశ్నించారు. ఏ పని చేసినా అందులో మర్మం ఎంత, తెలంగాణ సమాజానికి హితం ఎంత అని విడదీసి బోధించిన సోషల్ మీడియా అతిరథ మహారథులు కూడా దాలుస్తున్న మౌనం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందా? ప్రశ్నించే తత్వంతోనే నేను ప్రజా ఉద్యమంలోకి వచ్చాను అని చెప్పుకొచ్చిన తీన్మార్ మల్లన్న కూడా తన స్టాండ్ ను మర్చిపోయారా? ప్రభుత్వంతో చేతులు కలిపిన తర్వాత ప్రజలు చేద్దె పోయారా? ప్రభుత్వ అసమర్థత ఇలా ఉంటే ఇంకోవైపు ప్రతిపక్ష పార్టీలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ గొంతును గట్టిగా వినిపించడానికి పావులు కదుపుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం చేస్తున్న పని ఏంటో తెలియకుండా తికమకపడుతూ , ఇంకోవైపు ప్రభుత్వంలో అంతర్గత కుమ్ములాటలు నిస్సిగ్గుగా జరుగుతుంటే ప్రశ్నించే వాదులు ప్రశ్నించే తత్వాన్ని మరిచిపోయి అధికారం కోసం అర్రులు చాచుతుంటే తెలంగాణ సమాజం ఏమైపోవాలి? ఈ బాధ్యత ఎవరిది? ఆనాడు కేసీఆర్ ప్రభుత్వంలో మీడియాను నొక్కింది అని ప్రశ్నిస్తూ ఉద్యమాన్ని లేవనెత్తిన సోషల్ మీడియా అతిరథ మహారథులు నేడు ఒకరో ఇద్దరో ప్రశ్నిస్తున్నారు కానీ అసలు గొంతుక ఎందుకు తడబడుతుంది? ఎమ్మెల్సీ దక్కిన తర్వాత రాజకీయ రంగు అంటిందా!? తెల్ల చొక్కా వేసిన తర్వాత నాయకుడిగా ఎదిగినందుకా? ఏదైతేనేం ప్రశ్నించే తత్వం సమాధి అవుతోంది. పోరాటాల పురిటి గడ్డమీద మళ్లొకసారి ప్రశ్నించాల్సిన తరుణం ఏర్పడుతోంది. ప్రభుత్వాలు మారినా ప్రజా పాలన పూర్తిగా దారి తప్పుతోంది. ఏం చేస్తున్నారో అర్థం కాకుండా పిచ్చోడి చేతిలో రాయిలా తెలంగాణ మారనుందా? తెలంగాణ పౌరుషం పోరాటం ఉద్యమ స్ఫూర్తి ఎక్కడ పోయింది? మరోపారి ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది! విద్యార్థుల పోరాట ఫలితం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధించాం అన్న నిజాన్ని ఎందుకు సమాధి చేస్తున్నారు!? నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ఎవరు పూడుస్తారు!? మేధావులు ఇలాంటి విషయంపై మాట్లాడకుండా మౌనం దాలిస్తే ఈ సమాజానికి వాళ్ళు ఏం సమాధానం చెబుతారు!? అనే ఎన్నో ప్రశ్నలు తెలంగాణ సమాజం ఈ మేధావులను ప్రశ్నిస్తోంది....



- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

## ప్రేమ నగరానికి రహదారి సాయిబాబా



ఎక్కడో సుదూర తీరాల ఆవల లేదు ప్రేమ నగరం. తన హృదయాలకు చేరువలోనే పల్లెల్లో బయళ్లలోనే నిజమైన ప్రేమికులు దానిని ఆవిష్కరిస్తారు..... సంత్ కబీర్ కవితను సాయిబాబా ఇంగ్లీషులో అనువదిస్తే రాజేంద్ర బాబు తెలుగులోకి తర్జుమా చేశారు. ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా ప్రపంచ పీడిత ప్రజల ప్రియతమ కామ్రేడ్.మేధావి . ఆయన మనుషుల్ని ప్రేమించాడు. మత విద్వేషాలు, పీడన, అవమానాలు లేని ప్రేమ నగరం ఆయన స్వప్నం. తన ఐదేళ్ల వయసులో పోలియోసోతో 90 శాతం శరీరం నిర్వీర్యం అయింది. భూమిపై జన్మించిన ఏ శిశువు శరీరం నిర్వీర్యం కాకూడదని తలిచాడు. అందరికీ ఆరోగ్యం ఇచ్చే వ్యవస్థను కలగన్నాడు. తన కల సాకారం కొరకు కార్యాచరణకు పూనుకున్నాడు. అందుకు వర్గ వైరుధ్యాలు లేని సమ సమాజమే పరిష్కారంగా భావించాడు. అలాంటి సమాజం త్యాగాలను కోరుకుంటుందని అందుకు సిద్ధపడ్డాడు.

**ప్రేమ - విద్వేషం రెండు పరస్పర విరుద్ధం.**

సమాజాన్ని ప్రేమమయం చేయాలనుకునే తలంపు ఒకవైపు తపిస్తుంది. అలాంటి తలంపు ఉన్న మనుషులు భారతదేశానికి హృదయాన్ని అమర్చే ప్రయత్నంలో ఉన్నారు. వారు పల్లెల్లో,బయల్లో ప్రేమను ఆవిష్కరిస్తున్నారు. ఆదివాసులతో మమేకమవుతున్నారు. దుఃఖితుల కన్నుల్లో వెలుగులో నింపుతున్నారు.అందుకు తమ ప్రాణాలను మూల్యంగా చెల్లిస్తున్నారు. మరోవైపు విద్వేషం. అదొక దుర్గంధం. ఈ దేశంలో వందేళ్ళ విషవృక్షం. పదేళ్ల కాపు. ఈ భూమి మీద చాలా మతాలు ఉనికిలోకి వచ్చాయి. అనేక జాతులు ఏర్పడ్డాయి. మతం ఒకవైపు,జాతి ఒకవైపు దోపిడి పల్లకిని మోస్తున్న సందర్భాలు చరిత్రలో కనిపిస్తాయి. పాలకులకు అవసరమైనప్పుడు వాటిని వాడుకుంటారు.

ఈ దేశంలోనూ ఇప్పుడు అదే జరుగుతోంది. దీని ఫలితంగా దేశంలో అత్యంత క్రూరమైన హింసాత్మక మానసిక రోగం ప్రబలింది. బహుశా మునుపెన్నడూ ఈ దేశం చవిచూడని స్థితి అది. మనిషి మరణిస్తే సానుభూతి చూపటం, ఆ మనిషిలోని మంచిని వెతికి మరీ గుర్తు చేసుకోవటం మనకు తెలుసు. మనం వాటిని చూసాము. చూస్తున్నాము. కానీ ఈ మధ్య మరణాలను హేళన చేసే బాపతుగాళ్లు పుట్టుకొచ్చారు. మొన్న ఏచూరి , ఇప్పుడు సాయిబాబా మరణంలోనూ కొందరు చేస్తున్న వెకిలి, నేరపూరిత పైశాచికత్వం చూస్తే భయమేస్తుంది. మానవ సమాజం ఎటువైపు వెళుతోంది? సవాలక్ష సవాళ్లు మన ముందుకు వస్తున్నాయి. ఈ దేశంలో మానవ సంబంధాలను, మానవీయ విలువల్ని పాతరేసి ఏ పిశాచాల మరు భూమి గా మార్చదల్చుకున్నారు. తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. మనిషి రక్తం రుచి మరిగిన మృగం ప్రమాదకరమంటారు. సాటి మనిషి చావుని హర్షించే, స్వాగతించే మానవ మృగాలు మరింత ప్రమాదకరం. అటువంటి ఊహ కూడా గుండెల్ని బరువుగా మారుస్తుంది. అటువంటి బహు రూప కురూపి హృదయాలను మతోన్మాదులు ప్రతిష్టిస్తున్నారు. దేశం ప్రమాదకరమైన మలుపులో ఉన్న వేళ ఇది. ఈ సమయంలోనే సాయిబాబా లాంటి ఆర్ద్రత హృదయాల ఆవశ్యకత మెండుగా ఉంది. కానీ అటువైపు రాజ్యం నిలుచుంది. పైగా మతం మత్తులో కైపెక్కి ఉంది. అది మనిషిని ఎప్పటికప్పుడు చిద్రం చేస్తుంది. మతాల వారిగా భజన చేస్తుంది. మరీ ముఖ్యంగా దేహం నుండి ఉదయాన్ని పెరికేస్తుంది. మతం మరియు విద్వేషం కలగలిసిన నర మృగాన్ని సృష్టిస్తుంది. ఇటు వైపు నుండి మనం సాయిబాబా త్యాగనిరతిని ఎత్తి పడదాం. మన వెంట భక్తి ఉద్యమ వైతాళికులొస్తారు. సూఫీ తత్వ గురువులు దీవెనలు అందిస్తారు.



- మహమ్మద్ ఖలీల్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య TFTU
సెల్: 99129 15982

## మీ సేవలకు సలాం పోలీసన్నా..

### ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని వుండే ఒకే ఒక్కడు... పోలీస్

### పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి




పోలీసులు తమ విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని విధులు నిర్వహిస్తుంటారు. ధర్మాన్ని, సత్యాన్ని, న్యాయాన్ని కాపాడుతూ ధైర్యంగా శత్రువులను తిప్పి కొడతారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసు మేల్కొని, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు.తమ విధులలో భాగంగా రాత్రంతా మేల్కొని శాంతిభద్రతలను పరిరక్షిస్తారు. ఎండ, చలి, వాన, రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రజల కోసం నిరంతరం కాపలా ఉంటారు. ఈ క్రమంలో అనేక మంది పోలీసులు వీర మరణం పొందారు. 1959 అక్టోబర్ 21న పంజాబ్ రాష్ట్రానికి చెందిన డీఎస్పీ కరమ్‌సింగ్ ఆధ్వర్యంలో 21 మందితో కూడిన సీఆర్పీఎఫ్ దళం భారత్- చైనా సరిహద్దులలో గస్తీ తిరుగుతోంది. ఇదే సమయంలో చైనా బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాయి. మన సీఆర్పీఎఫ్ దళం వారిని దీటుగా ఎదుర్కొంది. ఈ ఘర్షణలో పది మంది భారత జవానులు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను గౌరవిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న 'పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకు, అందునా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం పోలీసులు చేసిన త్యాగానికి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత. పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడమే పోలీసు అమర వీరుల సంస్మరణ దినం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశం.నేడు పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా విశ్వంభర దినప్రతిక ప్రత్యేక కథనం..

**ఇరవై నాలుగు గంటలు పనిచేసేది ఒక్క పోలీసులే**

పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. ప్రతి ఒక్కరు ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే. ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసే. అన్ని పరిస్థితుల్లో అన్ని వేళల్లో పోలీసులే ముందుంటారు. సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసు కర్తవ్యం. అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు.

**పోలీసుల విశ్రాంతిని విస్మరిస్తున్న పాలకులు..**

నిద్రాహారాలు మాని డ్యూటీలు చేసే పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్నచూపే. సమయపాలన లేని విధులు, పై అధికారులతో తిట్లు, జనంతో ఛీత్కారాలు... ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. అన్ని సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నా ఎవరూ గుర్తించడం లేదని చాలామంది పోలీసులు వాపోతున్నారు. పోలీసులకు విశ్రాంతి కావాలనే విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు.

**ప్రభుత్వాల కర్తవ్యం ఇదీ..**

శాంతిభద్రతల పరిరక్షణ, వివిధ రకాల బందోబస్తులు, పెరుగుతున్న జనాభాతో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు, ఆస్తి కుటుంబ తగదాలు, హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు, సైబర్ నేరాలు, చోరీ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, మద్యం, డ్రగ్స్ నేరాలు, మత సంబంధ అల్లర్లు ఇలా రకరకాల సమస్యల మధ్యన విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు అమూల్యమైనవని మనం గుర్తించాలి. ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజలు పోలీసులకు సహకారం అందించాలి. కాలుష్యం బారినపడి చనిపోతున్నారు. సమాచార వ్యవస్థను రూపొందించాలి. పోలీసులు కూడా సుఖవంతమైన, సౌకర్యవంతమైన జీవితం గడిపే విధంగా చూడడమే మన కర్తవ్యం.

**వారిసేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత..**

విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమర వీరులను స్మరించుకొంటూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంను పోలీసుశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. శాంతియుత సమాజం కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం కోల్పోవడం వారి త్యాగ నిరతికి నిదర్శనమన్నారు. నేడు మన మధ్య వారు భౌతికంగా లేకపోయినప్పటికీ, వారి త్యాగాలను మరువలేనివి. కావున, దేశప్రజలందరూ వారి సేవలను ఈరోజున స్మరించుకోవాలి.

### మానసిక ఒత్తిడికి గురవుతున్న పోలీసులు..

ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే పోలీసుల విధులు విభిన్నం. వీరికి పని గంటలతో సంబంధం ఉండదు. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రతిక్షణం ఆలోచించాల్సిందే. దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోలీసులు అందరినీ పరిగణనలోకి తీసుకొంటే 80 శాతం మంది తలనొప్పి, బీపీ, మధుమేహం, మెడ, వెన్నునొప్పి ఇలా ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. హోంగార్డు, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల పరిస్థితి మరీ దారుణం. డ్యూటీకి వచ్చింది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేంత వరకు విరామం లేకుండా పనిచేయాల్సిందే. బందోబస్తు డ్యూటీల్లో పాల్గొనేవారి పరిస్థితి సరేసరి. రాష్ట్రవ్యాప్తంగా రోజూ 40 మంది సిబ్బంది అనారోగ్యంతోనే విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. ట్రాఫిక్ డ్యూటీలు నిర్వహించే సిబ్బంది కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది అనారోగ్యకర వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నందున ప్రభుత్వం వారికి అదనపు వేతనం చెల్లిస్తున్నా సరైన ఆరోగ్య పరీక్షలు లేని కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్ని సమస్యల మధ్య సమాజానికి ఇంత సేవ చేస్తున్న పోలీసులను గౌరవించడం మనందరి బాధ్యత.



-మేడేపల్లి నాగేందర్
సీనియర్ జర్నలిస్ట్
99851 19146

# ఎదగాలంటే రిస్క్ చేయాలి



**విశ్వంభర, హైదరాబాద్:** త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంచి లీడర్ అవ్వాలంటే త్యాగం చేసే గుణం, ధైర్యంతో ముందుకెళ్లే తత్వం ఉండాలని తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నాయకత్వ శిఖరాగ్ర సదస్సు - 2024లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఐఎస్‌బీలోని విద్యార్థులు నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకునేందుకు ఏడాదికోసారి ప్రముఖులు , వక్తలతో యాజమాన్యం సమావేశాన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ ఏడాది ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరై, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకం అవ్వగలిగితే ఏదైనా సాధించవచ్చని చెప్పుకొచ్చారు. జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించలేమని అన్నారు.

**ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యం**

ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నాయకుడిగా ఎదగాలంటే తెలివితేటలు, నైపుణ్యం, కష్టపడి పనిచేయడంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా అవసరమని అన్నారు. రాజకీయాల నుంచి తాను నాయకత్వం అంటే ఏంటో తెలుసుకున్నానని చెప్పారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతో మంది నాయకులు మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. తాను నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నానని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన వారసత్వం ఉందని చెప్పారు.

**ఐఎస్‌బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు..**

నాయకులు డబ్బు, వ్యక్తిగత జీవితం, సమయం ఇలా చాలానే త్యాగాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని విద్యార్థులకు సూచించారు. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలన్నారు. ఐఎస్‌బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు అని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలని కోరారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చనన్నారు.

**ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యం ..**

ఒలింపిక్స్‌లో భారత్ దురదృష్టవశాత్తు స్వర్ణ పతకాలు గెలవలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్ లో పిలుపునిచ్చారు.

**ఎక్కడికి వెళ్లినా హైదరాబాద్, తెలంగాణ గురించే మాట్లాడండి...**

దేశంలోని నగరాలతో కాదు.. హైదరాబాద్ ను న్యూయార్క్, పారిస్, లండన్‌తో పోల్చాలనుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎక్కడికి వెళ్లినా హైదరాబాద్, తెలంగాణ గురించే మాట్లాడండి అని కోరారు. హైదరాబాద్ ను రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని.. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పనిచేయాలి. మా ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి శాలరీలు ఇవ్వలేకపోవచ్చు. కానీ.. మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్ అందిస్తుంది. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలి''అని రేవంత్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరాన్ని దేశానికి ఒక రోల్ మాడల్ గా, గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ఆలోచన అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయాలనేదే లక్ష్యం**

తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయాలనేదే లక్ష్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇది సాధ్యం కావాలంటే 600 బిలియన్ డాలర్ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి కావాలన్నారు. కష్టమే అయినా.. అసాధ్యం మాత్రం కాదంటూ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని 600 మిలియన్ సిటీగా మార్చేందుకు అంతా సహకారం అందించాలని కోరారు. ప్రజలతో మమేకమైతే ఏదైనా సాధించవచ్చని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## ఏఐ అంటే రేవంత్ రెడ్డి ఎనుముల ఇంటెలిజెన్స్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ చేసినట్లు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారని.. రైతుల లెక్క విషయంలోనూ సీఎం అదే టెక్నిక్ వాడారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షలు అనే సంఖ్యను సీఎం రేవంత్ రెడ్డి (ఏఐ) అంటే (ఎనుముల ఇంటెలిజెన్స్)తో రూపొందించిందేనని ఎద్దేవా చేశారు. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలతోపాటు రుణమాఫీ తేదీలను మారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, నియోజకవర్గంలోనూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ విషయంలో నిబంధనలు, తేదీలు మారుతున్నాయని.. అబద్ధాలు, బూటకపు ప్రచారాలు మాత్రం నిత్యం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతున్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దక్షిణాదిలోనే అత్యాధునికంగా సికింద్రాబాద్ స్టేషన్

**విశ్వంభర, హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చి దిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి తెలిపారు. రూ.430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.430 కోట్లతో చర్లపల్లి, రూ.715 కోట్లతో సికింద్రాబాద్, రూ.429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించినట్లు తెలిపారు. దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు.

## చట్టబద్ధమైన వెంచర్లపై భయపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చట్టబద్ధమైన అనుమతులున్న వెంచర్ల విషయంలో భయపడాల్సిన అవసరం లేదని చెప్పింది. ''చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేస్తారని ప్రచారం చేస్తున్నారు. చెల్లుబాటు అయ్యే అనుమతులున్న నిర్మాణాలు కూల్చివేయబోమని సీఎం చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంది'' అని హైడ్రా స్పష్టం చేసింది.

## స్మారక కార్యక్రమంలో ఫుడ్ పాయిజన్

- **200మందికి అస్వస్థత...ఇద్దరి పరిస్థితి విషమం**
- **అసోం రాష్ట్రంలో ఘటన**

**గోలాఘాట్:** ఓ కార్యక్రమంలో స్నాక్స్ తిన్న తర్వాత దాదాపు 200మంది అస్వస్థతకు గురైన ఘటన అసోంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అసోంలోని గోలాఘాట్ జిల్లా, పాస్‌ఘోరియా గ్రామానికి చెందిన ప్రదీప్ గొగోయ్ అనే వ్యక్తి మరణించిన తన తల్లి స్మారక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన బంధువులకు సంప్రదాయ 'జల్పాన్' (పఫ్డ్ రైస్, క్రీమ్‌తో కూడిన స్నాక్స్) పెట్టారు. అయితే స్నాక్స్ తిన్న కొద్ది సేపటికి అతిథులు అస్వస్థతకు గురవ్వడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా దాదాపు 200మంది అస్వస్థతకు గురయ్యారని వైద్యులు పేర్కొన్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జోర్హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే బిస్వజిత్ ఫుకాన్ ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఇరత అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఫుడ్ పాయిజనింగ్‌కు గల కారణాలను పరిశీలిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి హాజరైన గ్రామస్థుల ఇళ్లకు వైద్య బృందాలను పంపినట్లుగా పేర్కొన్నారు.

## అశోక్ నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన

- **ప్రభుత్వ బలహీనవర్గాల గొంతుకోస్తోందని ఆరోపణ**
- **సీఎం మమ్మల్ని పిలిపించి బాధ వినాలి**
- **భారీగా మోహరించిన పోలీసులు**

**హైదరాబాద్:** అశోక్‌నగర్ చౌరస్తాలో గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల గొంతు కోస్తోందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. జీవో 29 వల్ల.. రిజర్వేషన్ పొందేవారు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందే అర్హత లేదని పేర్కొన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్నంత మాత్రాన తాము పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాదని స్పష్టం చేశారు. సీఎం తమను పిలిపించుకొని బాధ వినాలని కోరారు. ''ప్రతిపక్షాలతో మాట్లాడే బదులు మాతో మాట్లాడండి. ఆర్థికంగా, మానసికంగా చితికిపోయి ఉన్నాం. మా బాధ వినండి.. రాజకీయాలకు మేము అతీతం. మాకున్న చివరి అవకాశం చేజార్చకండి. ఇదేనా ప్రజాపాలన? దయచేసి ఆలోచించండి'' అని పలువురు అభ్యర్థులు కోరారు.

**గాంధీభవన్ ముట్టడికి పిలుపు**

అశోక్‌నగర్ వద్ద గ్రూప్-1 అభ్యర్థుల ప్రెస్‌మీట్‌ను పోలీసులు అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. లాఠీఛార్జ్ వద్దని సీఎం చెప్పినా పోలీసులు వినడం లేదని అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గాంధీభవన్ ముట్టడికి వారు పిలుపునివ్వడంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు.



## పోలీసుల నిఘా నీడలో 'మెయిన్స్'

**విశ్వంభర, హైదరాబాద్ సిటీ బ్యూరో:** గ్రూప్-1 ప్రధాన పరీక్షలకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరి బయోమెట్రిక్ తీసుకోనుండగా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రం తరలించే వాహనానికి తొలిసారిగా జీపీఎస్ వినియోగించనున్నారు. మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు.

**హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు..**

రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 ప్రధాన పరీక్షలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 46 పరీక్ష కేంద్రాల్లో 31,383 మంది హాజరు కానున్నారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తోంది. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితులను సమీక్షించనుంది. ఈనెల 21 నుంచి 27వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

**పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు..**

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు నగర పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనలు తారస్థాయికి చేరడంతో పశ్నపత్రాల తరలింపు, పరీక్ష నిర్వహణ, తిరిగి జవాబు పత్రాలు తీసుకెళ్లడం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా గట్టి పోలీసు బందోబస్తు కల్పించాలని నిర్ణయించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక ఎస్.ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ విధుల్లో ఉంటారు. అదనంగా ఒక పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తుంటారు. భద్రతా పరమైన ఏర్పాట్ల పర్యవేక్షణకు మూడు కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు.

**తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ...**

ప్రశ్నపత్రాలు, జవాబు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగిస్తోంది. స్ట్రాంగ్ రూముల నుంచి పరీక్ష కేంద్రానికి తరలించే వాహనాలకు జీపీఎస్ అమర్చి టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. వాహనం ఒక్కనిమిషం ఆగినా వెంటనే గుర్తించి అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. గ్రూప్-1 పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. వాచీలు, కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదు. మంగళసూత్రం, గాజులు మినహా ఆభరణాలను తేనివ్వరు.

## గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

**గాజా:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిన నేపథ్యంలో గాజా పౌరులపై ఇజ్రాయెల్ తీవ్రంగా విరుచుకుపడింది. ఉత్తర గాజాపై జరిపిన ఐడీఎఫ్ వైమానిక దాడుల్లో దాదాపు 87 మంది మృతిచెందినట్లు లేదా తప్పిపోయి ఉంటారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 40మంది గాయపడినట్లు వెల్లడించింది. మరోవైపు ఇరాన్ జరిపిన క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ సైనిక సన్నహాలు చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర గాజాలో బీట్ లాహియా పట్టణంపై ఇజ్రాయెల్ వైమానికి దాడులకు దిగినట్లు హమాస్ వార్త సంస్థ వెల్లడిచింది. ఈ ఘటనలో మొత్తం 87 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో అనేక మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడగా కొందరు శిథిలాల కిందే చిక్కుకుపోయారని అధికారులు వెల్లడించారు. మరోవైపు గాజాలోకి ఔషధాలు, ఆహారంతో నిండిన మానవతాట్రక్కులు చేరకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. పౌర నివాసాలే లక్ష్యంగా దాడులు చేయడమే కాకుండా ఆస్పత్రులను కూడా ముట్టడిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉత్తర గాజాలోని ఆస్పత్రుల్లో వైద్య సామగ్రి, మానవ వనరుల కొరత అధికంగా ఉందని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. అటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ విమానాలు గర్జించాయి. లెబనాన్ నుంచి 180 క్షిపణులు, డ్రోన్లు దూసుకొచ్చిన వేళ బీరుట్‌లోని దహియేహ్ ప్రాంతంపై ఐడీఎఫ్ బాంబులు కురిపించింది. ఈ ఘటనల్లో పలువురు మృతిచెందినట్లు సమాచారం.

**లీకైన యూఎస్ ఇంటెలిజెన్స్ పత్రాలు**

మరోవైపు, ఇరాన్‌పై ప్రతీకార దాడులకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు అమెరికా నిఘా సంస్థ ఎన్‌జీఏకు చెందిన రెండు కీలక పత్రాలు లీకయ్యాయి. ఇజ్రాయెల్‌లో అమెరికన్ గూఢచర్య ఉపగ్రహాలు సేకరించిన ఐడీఎఫ్ బలగాల షాటిలైట్ చిత్రాలకు సంబంధించిన చిత్రాలు అందులో ఉన్నాయి. వారు ఇరాన్‌పై దాడులకు సన్నద్ధమవుతున్నట్లు ఆ చిత్రాలను ఆధారంగా తెలిసిందని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఒక పత్రంలో యుద్ధ విమానాలకు గాల్లోనే ఇంధనం నింపడం, గాలింపు, రెస్క్యూ ఆపరేషన్‌లు సహా క్షిపణి వ్యవస్థల రీపొసిషనింగ్ విన్యాసాలను ఐడీఎఫ్ బలగాలు చేపట్టినట్లు న్యూయార్క్ టైమ్ కథనంలో వెల్లడైంది. మరో పత్రంలో ఇరాన్‌లోని లక్ష్యిత స్థావరాలకు సైనిక సామాగ్రి తరలింపు గురించిన సమాచారం ఉన్నట్లు తెలిపింది. నిఘా సమాచారం ఎలా లీకయిందన్న అంశంపై పెంటగాన్, అమెరికా నిఘా వ్యవస్థలతో పాటు ఎఫ్‌బీఐ విచారణ జరుపుతోంది. అటు అమెరి కా అధ్యక్షుడు బైడెన్ కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల సమాచారం తనకు తెలుసని తెలిపారు. పూర్తి వివరాలను వెల్లడించడానికి నిరాకరించారు.

## టెంపోను ఢీకొన్న స్లీపర్ బస్సు



**ధోల్‌పూర్:** రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది చిన్నారులు సహా 12 మంది మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఓ టెంపోను స్లీపర్ బస్సు ఢీకొట్టడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బారీ నగరంలోని కరీం కాలనీ గుమర్ మొహల్లాకు చెందిన నహ్నూ, జహీర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి బరౌలీ గ్రామానికి ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారు. అనంతరం టెంపోలో శనివారం రాత్రి తిరుగు ప్రయాణాన్ని మొదలుపెట్టారు. సునిపుర్ గ్రామం సమీపంలోకి వీరి టెంపో రాగానే, ఎదురుగా అధిక వేగంతో వస్తున్న స్లీపర్ బస్ ఢీకొట్టింది. దీంతో ఘటనాస్థలిలో ఒక్కసారిగా కలకలం రేగింది. జాతీయరహదారిపై వెళ్లే ఇతర వాహనాల డ్రైవర్లు, ప్రమాదాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. శవపరీక్షల కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్చురీలో భద్రపరిచారు. ఆదివారం ఉదయం శవపరీక్షలు నిర్వహించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులు ఉన్నట్లు వెల్లడించారు. గాయపడిన వారిలో బస్సు డ్రైవర్, క్లీనర్ కూడా ఉన్నట్లు చెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ ఏడీఎఫ్ కమల్ కుమార్ జాంగీద్, సబ్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ దుర్గాప్రసాద్ మీనా, సర్కిల్ ఆఫీసర్ మహేంద్ర కుమార్ మీనా తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

**ప్రమాద ఘటన హృదయవిదారకం: మోదీ**

రాజస్థాన్‌లోని ధోల్‌పూర్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. 'ఈ ప్రమాదం హృదయ విదారకం. అమాయక చిన్నారులతో సహా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఈ బాధను తట్టుకునే శక్తి బాధితుల కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించాలి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను ' అని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు.



## ఎస్బీఐ చైర్మన్ కు ఘన సన్మానం

**విశ్వంభర, వనపర్తి:** ఆర్యవైశ్య ముద్దుబిడ్డ చల్లా శ్రీనివాస్ గుప్త ఎస్బీఐ చైర్మన్ గా పదవి పొందిన తరువాత మొదటిసారిగా వనపర్తికి విచ్చేసిన సందర్భంగా వారికి టీజీ వెంకటేష్ తరపున శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూరి సురేష్ శెట్టి మాట్లాడుతూ.. మానవపాడు మండలంలో ఇదివరకు పేరు ప్రఖ్యాతులుగారించిన సురవరం ప్రతాపరెడ్డి మొదటి వ్యక్తి కాగా ఎస్బీఐ చైర్మన్ గా పోతులపాడు గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాస గుప్త ఎస్బీఐ చైర్మన్ గా నియమితులు కావడం మానవపాడు మండలం చేసుకున్న అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సిఏ ఫోరం అధ్యక్షులు కలిమిచర్ల విజయ్ కుమార్, చల్లా విజయ్ కుమార్, అనంత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 317పై తుది నివేదిక

- **సీఎంకు అందజేసిన కేబినెట్ సబ్ కమిటీ**
- **ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు**

**విశ్వంభర, హైదరాబాద్:** జీవో 317పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వేగం పెంచింది. కమిటీ రూపొందించిన నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పలువురు మేధావులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను ఆదివారం సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అందజేసింది.

## కేసీఆర్ పాలనలో సరైన టైమ్‌లో రైతుబంధు

- **కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు రావట్లేదు**
- **రేవంత్ రెడ్డి మోసాలను గ్రహిస్తున్న ప్రజలు**
- **అలయ్ బలయ్ లో మాజీ మంత్రి హరీశ్‌రావు**



**విశ్వంభర, కరీంనగర్:** కేసీఆర్ పాలనలో సరైన సమయంలోనే రైతుబంధు పంపిణీ చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాలు వచ్చేలోపే రైతుబంధు ఇవ్వాలని గతంలో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుబంధు రావడం లేదు.. చేప పిల్లల పంపిణీ జరగడం లేదు. రైతుభరోసా కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. రేవంత్‌రెడ్డి మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారు. వృద్ధులకు పింఛన్ పెంచుతామని చెప్పి మోసం చేశారు. రూ.4వేల పింఛన్ దగా.. తులం బంగారం దగా. ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి. రైతులు ధాన్యం ఎక్కడ అమ్మినా.. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్

- సమస్యలపై ఐక్య పోరాటం చేయాలి
- రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరిన ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు




**విశ్వంభర, హైదరాబాద్:** సమాజంలో భాధ్యత గల పౌరులుగా జర్నలిస్టులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. జర్నలిస్టులపై జరిగే దాడులను ఐక్యంగా ఎదుర్కొంటూ హక్కుల కోసం జాగ్రత్తమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం జెన్నారంలోని పీఆర్ టీయూ భవన్‌లో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ప్రత్యామ్నాయ యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూనే, జనం సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉండాలని అన్నారు. నిరంతర అధ్యయనం, ప్రజా సమస్యలపై కథనాలు అందిస్తూ సమాజంలో తమకంటూ స్థానం పొందాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయని, గత ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశాయని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే కొత్త ప్రభుత్వానికి విన్నవించామని, ప్రభుత్వం ఏర్పడి పది మాసాలు గడిచినా ఇంత వరకు పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, పెన్షన్ స్కీం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఫెడరేషన్ పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న ఇతర జర్నలిస్టు సంఘాలకు ప్రత్యామ్నాయం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం ఇదేనని అన్నారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వంలో పదవులు పొంది పాలకులకు తలొగ్గుతూ జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తున్నాయని, పదవులు, పైరవీల కోసం జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తిచేసి హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్ గుడిగ రఘు, కోశాధికారి ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు తన్నీరు శ్రీనివాస్, బిక్షపతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తొట్ల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడ మురుడేశ్వర్ ఎక్స్ ప్రెస్ రైలు షాద్‌నగర్‌లో ఆపాలని వినతి



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలో అభివృద్ధికి తగ్గట్టుగానే దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు సంబంధించిన అనేక మంది వ్యక్తులు జీవనోపాధికై ఇక్కడ నివసిస్తుంటారు. షాద్ నగర్ పట్టణం నుంచి అనేక ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉండడము, వివిధ ప్రాంతాల ప్రజలు రైలు సౌకర్యాన్ని వినియోగించుకోవడం జరుగుతుంది. కాచిగూడ నుండి మురుడేశ్వర్ కి వెళ్లే ఎక్స్ప్రెస్ రైలు వారంలో రెండు రోజులు మాత్రం షాద్ నగర్ మీదుగా వెళుతూ జడ్చర్లలో ఆగుతుంది. షాద్ నగర్ పట్టణంలో ఆ రైలును ఆపితే మూడు రాష్ట్రాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఉద్దేశంతో కేరళకు చెందిన మాలనాడు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక కౌన్సిలర్ రెటికల్ నందీశ్వర్ సహకారంతో, స్థానిక పట్టణ బీఆర్ఎస్ నాయకుడు రైల్వే బోర్డ్ మెంబర్ అయిన డాక్టర్ కే చంద్రశేఖర్ గౌడ్ ను కలుసుకొని షాద్ నగర్ రైల్వే స్టేషన్లో కూడా ఆగేవిధంగా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించాలని వినతి పత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్ రెటికల్ నందీశ్వర్ తో పాటు మాలనాడు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సంకుట్టి, కార్యదర్శి జాన్ జాకబ్, చైర్మన్ రాజన్ అబ్రహం, రవి నాయర్, కే.జగదీశ్, సచినందన్, కుసన్, రాజేష్‌లు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత



**విశ్వంభర, పరకాల:** కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర మండలం దుర్గంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చిల్ల తిరుపతి గత జూన్ నెలలో ప్రమాదవశాత్తు అకాలమరణ చెందడం జరిగింది.వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరు చేయించిన రెండు లక్షల రూపాయల ప్రమాద భీమా చెక్కును ఆదివారం ఉదయం పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని వారి నివాసంలో తిరుపతి కుటుంబసభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిశలు కృషిచేస్తున్న కార్యకర్తలు అకాల మరణం చెందితే ఆ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకే కేసీఆర్ ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా చేపించారని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్నిచర్ షాప్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ పరిధిలోని జవహర్ నగర్ క్రాస్ నందు నూతన తిరుమల ఫర్నిచర్ షాప్‌ని సహచర వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేశారు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవురుపల్లి గ్రామానికి నిధులు కేటాయించాలి



**విశ్వంభర, మాడుగుల :** మాడుగుల మండలం అవురుపల్లి గ్రామానికి చెందిన నాయకులు గ్రామ అభివృద్ధి నిధులు కేటాయించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, అవురుపల్లి నుండి సింగంపల్లి వరకు మట్టి రోడ్డు జెడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ ఎత్తు పెంచడం, గ్రామంలో హాస్పిటల్, సీసీ రోడ్ల పనులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలివేలు హరిమోహన్, పీఎస్ఎస్ డైరెక్టర్ బాలాగోని వెంకటయ్య, నాయకులు మల్ రెడ్డి రఘుకిషోర్ రెడ్డి, రంగారావు, ఇట్టికాల నర్సిరెడ్డి, బాలమోని కృష్ణయ్య, అలవాల వెంకటయ్య, ధోనదుల రాజేశ్వర్, కిన్నెర వెంకటయ్య, మేడం మహేష్, నోముల చెన్నయ్య, గౌని వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు.

## 2024లో భారతదేశ అతిపెద్ద డిజైన్ ఎగ్జిబిషన్



**విశ్వంభర, బషీర్ బాగ్:** బీఆర్డీఎస్ డిజైన్ ఎగ్జిబిషన్ 2024 అనేది భారతదేశంలోనే అతిపెద్ద డిజైన్ ఎగ్జిబిషన్. ఇది భన్వర్ రాథోడ్ డిజైన్ స్టూడియో (బీఆర్డీఎస్) ద్వారా హైదరాబాద్ లో ది ప్లాటినం బిజినెస్ హోటల్లో నిర్వహించారు. ఏటా ఈ ప్రదర్శన భారతదేశంలోని 12 నగరాల్లో నిర్వహించబడుతుంది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, బెంగళూరు, కోల్కతా, జైపూర్, లఖ్నవూ, భోపాల్, నాసిక్, నాగ్‌పూర్ లలో నిర్వహించారు. విద్యార్థులు వారి సృజనాత్మకతను కళాఖండాలు, 3డి మోడల్స్, దుస్తులు, కాన్వాస్ పెయింటింగ్ల రూపంలో 5000మందికి పైగా వ్యక్తుల సమక్షంలో ప్రదర్శించడానికి వేదికను అందించడం. ఎన్ఐడి, నిఫ్ట్, ఎస్ఏటీపీ, యూసీఈఈడీలలో విజయం సాధించేందుకు చిట్కాలపై బీఆర్డీఎస్ వ్యవస్థాపకుడు అండ్ అధ్యక్షుడు డాక్టర్ భన్వర్ రాథోడ్ ద్వారా గ్రాండ్ కెరీర్ సెమినార్ నిర్వహణ, దేశవ్యాప్తంగా 25కు పైగా డిజైన్ కళా శాలలు, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం ఈ కార్యక్రమం ముఖ్యాంశాలుగా ఉన్నాయి.

## ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, మహబూబాబాద్ :** శనివారం అర్థ రాత్రి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పట్టణంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలను (హాస్టల్) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహం లోని డైనింగ్ హాల్, కిచెన్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు రుచికరమైన భోజనం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. టైం టేబుల్ ప్రకారం స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని విద్యార్థుల యొక్క హెల్త్ వివరాలను రూపొందించాలన్నారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడుతూ స్టడీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## పేకాట రాయుళ్ల పై పోలీసుల పంజా, ఆరుగురు అరెస్ట్



**విశ్వంబర అక్టోబర్ 20 సంగారెడ్డి:** జిల్లా ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసు బృందాలు జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అసాంఘీక, చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా ఆదివారం పటాన్ చేరు మండలం ఇంద్రేశం గ్రామంలో కొంత మంది వ్యక్తులు ప్రభుత్వంచే నిషేదించిన మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్నారని సమాచారం అందిన వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసు బృందాలు పేకాట స్థావరానికి చేరుకొని, పేకాట ఆడుతున్న 6 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూపాయలు 91,270 మరియు 8 సెల్ ఫోన్లు , పేకాటకు వినియోగించిన ప్లేయింగ్ కార్డ్స్ సీజ్ చేసి, తదుపరి విచారణ కై నర్సింగరావు,. వెంకటేశ్వర్,పోతురాజు, అంకంరాజు,ఖాసిం,హరిబాబులను పటాన్ చేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



**విశ్వంభర, హైదరాబాద్:** వారాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వన్డే ర్యాపిడ్ ఇంటర్నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను జీపీ బిర్లాసెంటర్లో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో 494మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 68మంది విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఐపీఎస్ అధికారి రాజశేఖర్, రిటైర్డ్ ఎస్బీఐ ఏజీఎం బి.అశోక్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ చిలుకానగర్ డివిజన్

### ఎమ్మెల్యే బండారి కార్పొరేటర్ బన్నాల



**విశ్వంభర, సికింద్రబాద్:** చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో, ప్రశాంతనగర్ కాలనీలో సుమారు 63 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో దశలమారిగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా స్వీవరగే లైన్ పనులను కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు కొండల్ ప్రశాంత్ నగర్ కాలనీ అధ్యక్షులు డాక్టర్ విజయ మోహన్, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, పల్లె నర్సింగ్ రావు, అన్య బాల కృష్ణ, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, బింగి శ్రీనివాస్, అలిబిలి మహేందర్, మహమూద్ , చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, మధుసూదన్ రెడ్డి ,జిల్లాల ప్రవీణ్,%వీణ% షఫీ గౌస్ ,అనీఫ్, ఆటో శీను, శ్రీనివాస్, సికందర్, బిక్కు, సంతోష్, చందు , మహిళ నాయకురాలు జయమ్మ, రాయలమ్మ, రూప,రమ, మొదలగు వారు పెద్ద ఎత్తున పాల్గొన్నార.



వారాసీగూడ బోధ నగర్‌లో బీజేపీ నాయకులు మాదర్ల శ్యాంసుందర్, ఆధ్వర్యంలో మెడిసిన్‌తో సహా ఫ్రీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ ఫ్రీ మెడికల్ క్యాంపుని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, కంటెస్టెంట్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, హరి, నీలం శ్రీనివాస్, పలువురు బీజేపీ ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

### పూస బాలకిషన్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువ నగిరి జిల్లా, ఇంద్రపాలనగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న దట్టమైన పిచ్చి మొక్కలు ఉండడం వల్ల పాఠశాలలోనికి పాములు, తేళ్ళు వస్తున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, గ్రామ పెద్దలకు, అధికారులకు చెప్పడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ పిల్లలు భయబ్రాంతులకు గురవుతున్న తరుణంలో జేసీబీ డోజర్ సహాయంతో దగ్గర ఉండి చెట్లను తీయించి, బాగు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దగోని వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ గర్దాసు సురేష్, బందారపు వెంకటేష్, రాచకొండ అంజయ్య, కాంబాలపల్లి శ్రీశైలం, కడారి వెంకటేష్, మేకల నరేష్, ఉల్లె కృష్ణ, పంగా స్వామి,రుద్రాల విక్కి, ఉల్లే నరేష్, పబ్బు మచ్చేందర్, జ్ఞానేశ్వర్, మధు, మల్లేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## దేవాలయ ప్రాంగణంలో బోర్ వేయించిన ఎమ్మెల్యే వీరేశం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం సమీపంలో, అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం, దేవాలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు జిల్లా నాయకులు పూస బాలకిషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీరేశం సహకారంతో త్వరితగతిన బోర్ ని సాంక్షన్ చేయించి, వేయించారు. సమస్య చెప్పగానే మా ఎమ్మెల్యే వేముల వీరేశం పరిష్కరించాడని, అయ్యప్ప స్వాములు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం తెలియజేసి, ఎమ్మెల్యే వేముల వీరేశం కు, మాజీ ఎంపీపీ పూస బాలమణి – బాలనర్సయ్య కు, జిల్లా నాయకులు పూస బాలకిషన్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## పద్మశాలీలు రాజకీయ రంగంలో రాణించాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు: గుజ్జ సత్యం



**విశ్వంభర, హయత్ నగర్:** విద్యా, వ్యాపార వాణిజ్య రంగాల్లో ఎంతో గుర్తింపు పొంది ఉన్న పద్మశాలీలు రాజకీయ రంగంలో కూడా రాణించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు. ఆదివారం ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్నా గణేశ్ నేత , మేళా ఛైర్మన్ రవితేజ ఆధ్వర్యంలో ఆటో నగర్ లోని హరణి వనస్థలిలో పద్మశాలి దసర మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ భారతదేశంలో ఎంతో ఉన్నతమైనది మన పద్మశాలి కులం అన్నారు. మన జాతిలో అద్భుతమైన మేధస్సుతో పాటు అన్ని శాస్త్రాల్లో ఎంతో మంది ప్రపంచవ్యాప్తంగా గొప్ప స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. స్వాతంత్ర ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు మన జాతి పాత్ర మహోన్నతమైనదని అన్నారు. సకల శాస్త్రాన్ని అభ్యసిస్తున్నాం, అన్ని వ్యాపారంలో ప్రపంచవ్యాప్తంగా విస్తరించి మన ఉనికిని చాతుతున్నామని తెలిపారు. కానీ జాతి ఎదుగుదలకు ఎంతో ముఖ్యమైన రాజకీయ అధికారానికి చాలా దూరంలో ఉన్నామని అన్నారు. కారణాలు ఏమైనాప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లో కూడా మన పాత్ర ఎంతో అవసరం ఉందని తెలిపారు. మన కష్టనష్టాలు చెప్పుకోవడానికి సరైన ప్రతినిధులు లేరని అవేధన వ్యక్తం చేశారు. గురుదర బాధ్యత మనందరం తీసుకొని రాజకీయ చైతన్యం కొరకు రాజ్యాధికారం కొరకు మన యువతలో స్ఫూర్తి నింపాలని తద్వారా అధికారం సాధించడంలో ముఖ్యపాత్ర పోషించాలని తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘము అధ్యక్షులు కండగట్ల స్వామి, గడ్డం లక్ష్మీనారాయణ తులసీదాస్ ,సీత ఆంజనేయులు, రాపోలు సుధాకర్,బొమ్మ రఘురాం నేత, వేముల రాము నేత తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద చక్రపాణికి ఘన సన్మానం




**విశ్వంభర, ఎల్బీనగర్:** మల్లేశం సినిమా నటులు,దాసి వంటి 45 సినిమాలలో నటించిన నటులు, రచయిత ఆనంద చక్రపాణి ని ఆదివారం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్, విభిన్న పాత్రభినయ కళాకారుడు, రచయిత డా.. పెండెం కృష్ణకుమార్ కలిసి సన్మానించడం జరిగింది. కృష్ణ కుమార్ ప్లాస్టిక్ నిషేధం పై పర్యావరణ గురించి అవగాహన క్లాత్ బ్యాగుల వినియోగం గురించి, నీటి పొదుపు, పరిసరాల పరిశుభ్రత, దేశ భక్తి, నీతి, నిజాయితీ ఉండే విధంగా ముఖ్యంగా మత్తు రహిత సమాజం కోసం యువతకు అవగాహన వచ్చే విధంగా సినిమాలు తీసి ప్రజలకు తెలియజేయడం కోసం కృషి చేయగలరని కోరారు.

## గ్రామీణ క్రీడా రంగం బలోపేతం చేస్తాం : చైర్మన్ శివసేనారెడ్డి




**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది అని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్‌లు అన్నారు. గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న సీఎం కప్ 2024 ని విస్తృత స్థాయిలో ప్రచారం చేసే ఆలోచనతో నిర్వహిస్తున్న టార్చ్ రిలే ర్యాలీ అక్టోబర్ మూడో తేదీ హైదరాబాద్ నగరం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమై 31 జిల్లాలు పూర్తిచేసుకుని రంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంది. రంగారెడ్డి జిల్లా టికేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ కమాన్ వద్ద వేలాది మంది క్రీడాకారుల క్రీడాజ్యోతి ప్రారంభమై సరూర్నగర్ ఇండోర్ స్టేడియంకి చేరుకుంది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సభా కార్యక్రమంలో డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్, వెల్ఫేర్ ఐజి రమేష్ రెడ్డి, ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, ఒలంపిక్ అసోసి యేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం.



**విశ్వంభర, మలక్ పేట్:** మలక్ పేట్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 2009-10 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులచే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిమాయత్ నగర్ మండల ఉప విద్యా అధికారిని విజయ లక్ష్మి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా విజయ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయి లో ఎదిగి నప్పుడే ఉపాధ్యాయులు ఎంతో సంతోష పడుతారు అని అన్నారు.వారి వారి వృత్తి లో నైపుణ్యాన్ని సంపాదించు కోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో రమ, విజయ లక్ష్మి, అమరావతి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి రూ.25 వేలు అందజేత



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో చేపట్టిన నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తనయుడు ఏపీ మిథున్ రెడ్డి 25 వేల రూపాయల నగదును దేవాలయ కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్, ఎల్ కుమార్ గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య లకు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం అందజేసిన ఏపీ మిథున్ రెడ్డికి దేవాలయ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వానాకాలం రైతు భరోసాను ఎగగొట్టడం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయడమే..

## మంత్రి తుమ్మల ప్రకటనకు నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు



**విశ్వంభర, షాద్‌నగర్/మెట్‌పల్లి /మేడిపల్లి/ ఆమనగల్లు/కడ్తాల్:** ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా పోయినట్లే అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఇచ్చిన ప్రకటనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం పంట సీజన్ కు రైతులకు రైతుబంధు వస్తుందన్న ఆశ ఆడియశలు అయ్యాయన్నారు. రైతుబంధును ఈ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టేసింది అని అన్నారు. లక్షలాది మంది రైతుల నోట్లో మట్టికొట్టింది ఈ ప్రభుత్వం అన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా వెయ్యాలని ఇచ్చేవరకు రైతుల పక్షాన ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, వెంకట్ రెడ్డి, లక్ష్మన్ నాయక్, వెంకటేష్ గౌడ్, పిల్లి శేఖర్, నందకిశోర్, జూపల్లి శంకర్, ఏజాజ్ (అడ్డు), పర్వేజ్‌హుస్సేన్,బిలాల్, సాదిక్, శంకర్, వేణుగోపాల్, భిక్షపతి,రామరాజు, రవి, నర్సింలు,ఈశ్వర్,షబ్బీర్ లాల, నిజాం, ఇర్ఫాన్, కాట సుధీర్, గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

### మెట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుల ధర్నా



మెట్‌పల్లి పట్టణంలోని ( ఖాధీ ) పాత బస్టాండు ఆవరణలో ప్రధాన రహదారిపై మెట్‌పల్లి మండల, పట్టణ బీఆర్ ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గ శాసనసభ సభ్యులు కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు కోరుట్ల నియోజకవర్గంలోని వివిధ పట్టణాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోయినపెల్లి చంద్రశేఖర్ రావు, మెట్‌పల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం రాజరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు గడ్డం రాంరెడ్డి, PACS మెట్‌పల్లి వైస్‌చైర్మన్ గోపాడి జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పీసు తిరుపతి రెడ్డి, బద్దం శేఖర్ రెడ్డి, ఆకుల రాజారెడ్డి, నాయకులు అరెళ్ల రాజగౌడ్, చౌట్పల్లి అంజయ్య, కౌన్సిలర్‌లు బంగారుకల్ల కిషోర్, మోరెపు గంగాధర్, నాయకులు ఒజ్జెల శ్రీనివాస్, మార్గం హన్మాండ్లు, బిమనాతి సత్యం, గజం రవి, బీఆర్యస్ నాయకులు పుల్ల జగన్ గౌడ్, తిరుపతి, డాకురి వెంకటేష్, కోరెపు వెంకటేష్, డబ్బ గంగారెడ్డి, శోభన్ రెడ్డి, ప్రణయ్, నరేష్, బర్ల అర్జున్, నల్ల భూమేష్ పాల్గొన్నారు.

### మేడిపల్లి మండల కేంద్రంలో..



కాంగ్రెస్ రైతు భరోసా ఎగవేతపై రైతులకు మద్దతుగా మేడిపల్లి మండల కేంద్రంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, ఎంపీటీసీ అధ్యక్షులు సీహెచ్ రవీందర్ రావు, సింగిల్ విండో చైర్మన్ రమేష్ రెడ్డి, మేడిపల్లి ఎంపీటీసీ మకిలి దాసు, కో ఆపష్న్ హైమద్, మేడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దేశవేని కృష్ణ ,మాజీ %ూవీజ% చైర్మన్ రమ్య ఆదిరెడ్డి , కిసాన్ గౌడ్, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు ముక్కర గంగాధరి, కట్లకుంట గ్రామ శాఖ అధ్యక్షులు భూమరెడ్డి, పోరుమల గ్రామ శాఖ అధ్యక్షులు నారాయణ గౌడ్, చిట్యాల రాజేందర్, భీమారం గ్రామ శాఖ అధ్యక్షులు రాజాబోస్, భీమారం ఎంపీటీసీ పల్లి అర్జున్ ,డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ లు , బి ఆర్ ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆమనగల్లు పట్టణంలో



ఆమనగల్లు పట్టణంలో కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రంలో రైతు బంధు రైతురుణమాఫీ వెంటనే ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటీసీ అనురాధ పత్య నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తాం సంవత్సరానికి ఎకరానికి రూ. 15000 ఇస్తాం మహిళలకి రూ. 2500ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలని మోసం చేస్తుందని మండపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, ఎనుముల రమేష్, యూత్ వింగ్ అధ్యక్షులు డేరంగుల వెంకటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లండం యాదయ్య, వడ్డే మోని శివకుమార్, గుత్తి బాలస్వామి, హేమ్లా నాయక్, సాయిలు, సైదులు, గణేష్, ఆనంద్, భీమయ్య, గణేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కడ్తాల్‌లో..




తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేస్తున్నది ఎనుమల రేవంత్ రెడ్డి కాదని ఆయన ఆరు గ్యారెంటీల ఎగవేత రేవంత్ రెడ్డి అని కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షుడు పరమేష్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో రైతు మహాధర్నా కార్యక్రమంలో రైతులతో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కారుపై నిప్పులు చెరిగారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రెండు పంటలు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్ ఒక్క పంట కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచులు లక్ష్మి నర్సింహారెడ్డి, తులసి రామ్ నాయక్, హరిచంద్ నాయక్, కృష్ణయ్య, నరసింహ గౌడ్ డైరెక్టర్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు మంజుల చంద్రమౌళి, నరసింహ, అంజి రైతులు పాల్గొన్నారు.

### చింతపల్లిలో..



రైతన్నలను ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని చింతపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రములో రైతులకు ఇవ్వవలసిన వర్షాకాల రైతు భరోసా ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన కాలయాపన చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎకరానికి 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రైతులకు క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్లంకి చంద్రశేఖర్, బిఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, రైతు విభాగం అధ్యక్షులు మద్రు రామారావు, ఎస్టి సెల్ అధ్యక్షుడు రమావత్ కొండల్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు దండేటికార్ మోహన్, ఎం.డి ఖాలేద్, నల్ల శంకర్, సిమర్ల కృష్ణ యాదవ్, ఉప్పల యాదయ్య, తిరుమణి పాపయ్య, కాయితి బచ్చిరెడ్డి, రమావత్ మాంత్య నాయక్, వంకుడావత్ బాల్ సింగ్, జర్పుల రాజు, మల్లోజు గోపి, ధన్ రాజ్, సిద్ద స్వామి, బద్రి అంజి, ఊరే మదు, శేఖర్, మల్లోజు గోపి, జిట్ట జగదీష్, ఆరెకంటి మురళి, గార్లపాటి రవిచంద్ర, కోట మరి బాబు, సమ్మిడి జంగారెడ్డి, వింజమూరి అబ్బయ్య, వరికుప్పల కృష్ణ, రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హై కోర్ట్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విశిష్ట సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన సీహెచ్ వెంకటేశ్వర రావుకు ఆదివారం ఛత్రపురి కమ్యూనిట్ హాల్‌లో సన్మానం చేసిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక అధినేత డా.కాచం సత్యనారాయణ.

## మహబూబాబాద్ వర్కింగ్ జర్ణలిస్టు ఆఫ్ ఇండియా యూనియన్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం

### రాష్ట్ర వర్కింగ్ వైఎస్ ప్రెసిడెంట్ కరుణాకర్ దిశా నిర్ధేశం




**విశ్వంభర,మహబూబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టుల ఆఫ్ ఇండియా జిల్లా జర్ణలిస్టుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నదని డబ్ల్యు జే ఐ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్ అన్నారు . రాష్ట్రంలో సంఘాల పేరుతో ఇన్ని రోజులు జర్నలిస్టులను మభ్యపెడుతూ వారి సమస్యలను తీర్చడంలో పలు సంఘాల పేర్లు చెప్పుకుంటూ నాయకులు విఫలమయ్యారని అన్నారు జర్నలిస్టులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలకు సహకారం అవుతాయని హితవు పలికారు రాబోయే రోజుల్లో బిఎమ్ ఎస్ అనుబంధ సంఘం జిల్లాలో బలపడుతుందని,సంఘం సమాజ హితం ,ధర్మం ,న్యాయం ,హక్కుల కోసం ఎప్పుడూ పోరాటం చేస్థుందని ,అలా చేయడానికే కంకణ బద్ధులుగా కదిలి రావాలని తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు సంఘంలో అందరూ సమానులే అని, పని విషయంలో చిన్న పెద్ద ఉండదని, ఒకరికొకరు సహకారం ఇచ్చిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సంఘాల పేరుతో వారిని పరామర్శించే తీరికలేకుండా పలువురు ఉంటున్నారని ఇది జర్నలిస్టుల ఐక్యతను దెబ్బతీయటమేనని ఇలాంటి పనులు ఎవరు చేసినా జర్నలిస్టుల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. కొత్తగూడెం జిల్లాలో ఇల్లందు జర్ణలిస్టు సుదర్షన్ పై దాడిని తీవ్రంగా ఖండించాలని,దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని,ఎలాంటి దాడులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. దాడి జరిగిన సుదర్షన్ ను ఖమ్మం ఆసుపత్రిలో సంఘనాయకులు పరామర్శించినట్లు తెలిపారు. ఇప్పటికైనా జర్నలిస్టులు ఐక్యంగా తమ సమస్యలపై పోరాడాలని ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకులు అనిల్ దేశాయ్ అడపు లక్ష్మీనారాయణ జిల్లా జర్నలిస్టు మిత్రులకు పిలుపునిచ్చారు. యూనియన్ సభ్యత్వం ఆన్ లైన్ లో కాని ఆఫ్ లైన్ లో పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టులు రమేష్ అయోధ్య రామయ్య సుమన్ రెడ్డి ఇంద్రారెడ్డి మధు సుమన్ కపిల్ ప్రకాష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ బిర్యానీలో చచ్చిన కప్ప

- కంగుతిన్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు
- ఆలస్యంగా వెలుగులోకొచ్చిన ఘటన
- సోషల్ మీడియాలో వైరల్



**విశ్వంభర, హైదరాబాద్:** బిర్యానీ అంటే ఎవరికి నచ్చదు చెప్పండి. ఇంట్లో ఏ చిన్న వేడుక జరిగినా బిర్యానీ లేనిదే ముద్ద దిగదు. బిర్యానీ అంటేనే ఓ ఎమోషన్. బిర్యానీ ముఖ్యంగా ఫిష్ బిర్యానీ, మటన్ బిర్యానీ, ప్రాన్స్ బిర్యానీ, కుండ బిర్యానీ, దమ్ బిర్యానీ అంటూ ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంచక్కా లాగించేస్తుంటారు. బిర్యానీ అంటే కేవలం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాదు అన్నట్లు బిర్యానీ రెసిపీలను తయారు చేస్తారు. అందులోనూ చికెన్ బిర్యానీ అంటే చిన్నవారి నుంచి పెద్దవారి వరకు యమ క్రేజ్‌గా యమ్మీ యమ్మీ అంటూ లాగించేస్తుంటారు. సాధారణంగా చికెన్ బిర్యానీ వండాలంటే చికెన్‌తో పాటు లవంగాలు, దాల్చిన చెక్క వంటి సుగంధ ద్రవ్యాలుతో పాటు కొత్తిమీర, పుదీనా, నెయ్యి వేసి చేస్తుంటారు. ఇవి అన్ని పెనంలో పడిన తర్వాత చికెన్ బిర్యానీకి వచ్చే టేస్టే అదరహో అనిపిస్తుంది. కానీ అవేమీ కాకుండా ఈ మధ్య జెర్రెలు, బల్లులు, బొద్దింకలతో కొందరు చికెన్ బిర్యానీ చేస్తున్నారు. ఇలాంటివి చాలా చోట్లనే జరుగుతున్నాయి. ఆ మధ్య హైదరాబాద్‌లోని ఓ రెస్టారెంట్‌లో చికెన్ బిర్యానీ జెర్రీ వచ్చిందన్న వార్త సోషల్? మీడియాతో హల్‌చల్ సృష్టించింది. ఆ జెర్రీ విషయాన్ని మర్చిపోకముందే, బిర్యానీలో చనిపోయిన కప్ప అంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**చికెన్ బిర్యానీలో కప్ప :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ మెస్‌లో ఈ తంతు వెలుగు చూసింది. ఈ నెల 16న విద్యార్థులకు మెస్‌లో చికెన్ బిర్యానీ వడ్డిస్తుండగా అందులో కప్ప ప్రత్యక్షమైంది. పైగా ఆ కప్ప బతికి లేదు. చనిపోయి ఉంది. ఆ ఫోటోను చూస్తే ఏకంగా బిర్యానీతో పాటు వండేసినట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు కంగుతిన్నారు. ఆ షాక్ నుంచి తేరుకొని మెస్ ఇన్‌ఛార్జికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ ఫొటోను ఎవరో విద్యార్థి సోషల్ మీడియా వేదిక (ఎక్స్)గా షేర్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ప్రస్తుతం చికెన్ బిర్యానీలో కప్ప అని వైరల్ అవుతుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# జర్నలిస్టుపై దాడి కేసులో ముగ్గురి రిమాండ్

- మరో ముగ్గురి మాటేమిటి?
- నిందితులందరినీ అరెస్టు చేయాలి
- ఖమ్మంలో సుదర్శన్‌ను పరామర్శించిన డబ్ల్యుజేఐ బృందం



**విశ్వంభర, ఖమ్మం:** ఆరుగురు వ్యక్తులు విచక్షణా రహితంగా జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి ఖమ్మం ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల ఆదాబ్ హైదరాబాద్ పత్రిక విలేఖరి సుదర్శన్ ను బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధి బృందం పరామర్శించింది. బీరుబాటిలళ్ళు, ఇనుప రాడ్లతో ఆరుగురు వ్యక్తులు జరిపిన దాడిలో ఛాతి, దవడ ఎముకలు విరిగి ఇంటెన్సివ్ కేర్‌లో చికిత్స పొందుతున్న సుదర్శన్‌ను పరామర్శించిన డబ్ల్యూజేఐ నేతలు ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.సుదర్శన్ పై దాడి ఘటనలో పాల్గొన్న వ్యక్తులకు సంబంధించి వీడియో ఫుటేజ్ సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం అయినప్పటికీ, ఇందులో కేవలం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కుపంపి, మరో ముగ్గురి విషయంలో విచారణ పేరిట కాలయాపన చేస్తుండటం అనేక అనుమానాలకు తావునిస్తున్నదని యూనియన్ నాయకులు తాడూరు కరుణాకర్, న్యాలకొండఅనిల్ రావు అన్నారు. ఇల్లందు పోలీసులు రాజకీయ నేతలు, లేదా ఇతరత్ర ఒత్తిళ్లకు తలవొగ్గి ఈ కేసులో నిందితులను ఉపేక్షిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సుదర్శన్ పై గతంలో కూడా హత్యాయత్నం జరిగిందని, అదృష్టవశాత్తు ఈ రెండు ఘటనల నుండి ఆయన బతికి బయటపడ్డారని, కనుక భవిష్యత్తులో ఆయన ప్రాణాలకు రక్షణ కల్పించే బాధ్యత స్థానిక పోలీస్ యంత్రాంగంపైనే ఉందన్నారు.జర్నలిస్ట్ సుదర్శన్ పై జరిగిన పాశవికదాడిని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలకు తావు లేదన్నారు. ఒక పాత్రికేయునిపై దాడి జరపడం అంటే, అది యావత్ పాత్రికేయ లోకంపై జరిగిన దాడిగాభావించాల్సి ఉంటుందన్నారు.జిల్లా మంత్రి, ప్రభుత్వంల ఇల్లందు ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, దోషులు ఎంతటి వారైనాకఠినంగా శిక్షలు పడే ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు. ఖమ్మం ఆస్పత్రిలో జర్నలిస్టు సుదర్శన్ వారి కుటుంబ సభ్యులను కలసి పరామర్శించిన వారిలో డబ్ల్యూజేఐ నాయకులుఅడెపు లక్ష్మీనారాయణ, డి శ్రీధర్తదితరులు ఉన్నారు.

## నేటినుంచి ధ్రువపత్రాల పరిశీలన



**విశ్వంభర, మహబూబాబాద్:** 2024-2025 విద్యాసంవత్సరానికి గానుతెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ ఫార్మసి కళాశాలలో బి.ఫార్మసి ప్రవేశం కొరకు విద్యార్థులు TG. EAPCET షెడ్యూల్ క్రమంలో ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 21 వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరుగుతుందని, ధ్రువపత్రాల పరిశీలనంతరం కళాశాల ఎంపిక ప్రాతిపదికలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళ ఫార్మసి కళాశాల (TG. EAPCET-2024)లో కళాశాల కోడ్ TSPW మహబూబాబాద్ గా ఎంపిక చేసుకోగలరన్నారు. కళాశాల ఎంపిక ఈనెల 21వ తేదీనుండి 25వ తేది వరకు తొలివిడత మరియు చివరివిడతలో భాగంగా వచ్చే నెల అనగా నవంబర్ 5వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరుగుచున్నవని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. యం. స్వప్నరెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యుద్ఘాతంతో మహిళ మృతి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన అవుల లింగస్వామి పోలీసులకు తెలిపిన సమాచారం ప్రకారం, అవుల పద్మ, భర్త దివంగత నర్సింహ, ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన వ్యక్తి, ఈ రోజు ఉదయం 09:30 గంటల సమయంలో తన వ్యవసాయ భూమి వద్దకు వెళుతుండగా, ఈలోగా ఆమె సింగారపు అశోక్ వ్యవసాయ భూమి వద్దకు చేరుకోగానే, దురదృష్టవశాత్తు నిన్న రాత్రి పిడుగుపాటుకు తెగిన విద్యుత్ తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇది గమనించిన గ్రామస్తులు రామన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ

**విశ్వంభర, కేసముద్రం:** మండలం కోరుకొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మేఘ్య తండాకి చెందిన లకవాత్ మౌనిక శనివారం రోజున పిడుగుపాటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగడ సానుభూతి తెలిపిన మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బోనగిరి ఎల్లమ్మ గారు అనారోగ్యంతో ఉదయం మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎంపి పోరిక బలరాం నాయక్ అదే గ్రామానికి చెందిన కోమటిరెడ్డి ముత్తి రెడ్డి ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపిన మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ వారితో పాటు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల మురళీ, వేముల శ్రీనివాస్ రెడ్డి, కొరుకొండపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సాట్ల శ్రీనివాస్, భులోక్ రెడ్డి, బాలాజీ రెడ్డి,మేది ఉపేందర్, నాగెల్లి వెంకన్న, యూత్ ఉపాధ్యక్షులు అల్లం గణేష్,మాజి ఉపసర్పంచ్ వెంకన్న, భూలోక్ రెడ్డి, ఉప్పరపల్లి గ్రామ కమిటీ పార్టీ శ్రేణులు, తదితరులు ఉన్నారు.



# రైతు భరోసా ఉన్నట్లా.. లేనట్లా..?

**విశ్వంభర భూపాలపల్లి:** బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతుబంధు కింద ఇచ్చే 10 వేలు రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదని..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి.. రైతులకు 2 లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి రైతుల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, అదేవిధంగా రైతు భరోసా ఉన్నట్లా.. లేనట్లా.. ఏదో విషయాన్ని రైతులకు తెలియజేయాల్సిన అవసరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు నేతృత్వంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టి, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్, మొగుళ్ళపల్లి మాజీ జెడ్పిటిసి జోరుక సదయ్యలు మాట్లాడారు. 6 గ్యారంటీలతో 420 హామీలను ఇచ్చి ప్రజలను, రైతు భరోసా..రైతు రుణమాఫీ పేరుతో రైతులను, రెండు లక్షల ఉద్యోగాల పేరుతో విద్యార్థులను, యువకులను మభ్యపెట్టి ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరందరిని నిట్టనిలువునా మోసం చేసిందన్నారు. రైతు భరోసా నిధులను వెంటనే రైతుల అకౌంట్లో వేయాలని,



మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 2500 ఇప్పటి వరకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని కేసీఆర్ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే..కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని అమలు చేయకపోగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా నిధులను రైతుల అకౌంట్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిసిల్ల గ్రామ మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నరహరి వెంకట్ రెడ్డి, కొర్కిశాల మాజీ సర్పంచ్ దానవేని రాములు మరియు వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కుంగ్‌ఫూలో నైపుణ్యం సాధించాలి



**విశ్వంభర, షాద్‌నగర్:** విద్యార్థులు చదువుతో పాటు ఆత్మ రక్షణకు కుంగ్ ఫు,కరాటే లాంటి వాటిలో నైపుణ్యం సాధించాలని సూచించారు న్యూ పవర్ కుంగ్‌ఫు అకాడమీ ఫౌండర్, కోచ్,ట్రైనర్ బాల్ రాజ్.న్యూ పవర్ కుంగ్‌ఫు అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం టీచర్స్ కాలనీలో విద్యార్థులకు బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ పులిందర్ రెడ్డి, అహ్మద్ ఖాన్,రవీందర్ రెడ్డి, వెంకటేష్, కాలనీ సభ్యులు అర్జున్ కుమార్,శివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,ఉన్నారు.

## ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల మోదీ హామీ ఏమైంది?

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్:** ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రధాని మోదీ హామీ ఏమైందో బీజేపీ నేతలు చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతమంది ఉద్యోగాలు ఊడగొట్టిందో తమ వద్ద లెక్క ఉందన్నారు. "ప్రధాని మోదీ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి లక్షల మంది ఉద్యోగాలు పోగొట్టారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కసారి కూడా గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వలేదు. కనీసం 70 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ఇంటర్ ఫలితాలను తప్పుల తడకగా ఇచ్చి వందలాది మంది విద్యార్థుల చావులకు కారణమైంది. కానీ, 10 నెలలు కూడా పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసింది. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో భారాస ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ప్రస్తుతం చర్చనీయాంశమైన జీవో 29ను ఫిబ్రవరి నెలలో ఇచ్చారు. విపక్షాలు ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదు. అభ్యర్థులను తప్పుదోవ పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పరీక్షలు తరచూ వాయిదా పడితే అభ్యర్థులకు మంచిది కాదు. 563 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ ఫిబ్రవరిలో విడుదలైంది. నిరుద్యోగులను ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను కోరుతున్నాం. రాజకీయ నేతల కుట్రపూరిత ఉచ్చులో విద్యార్థులు పడొద్దు. ఎవరిపైనా లాఠీఛార్జ్ చేయొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.



సంఘీ టెంపుల్ ఛైర్మన్, వార్త దినప్రతిక సీఎండీ, మాజీ ఎంపీ, పారిశ్రామిక వేత్త గిరీష్ సంఘీ, ఆర్యవైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన బెలిదె రమేష్ గుప్తల చేతుల మీదుగా ,ఆర్య వైశ్య మహాసభ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికై మెమెంటో స్వీకరిస్తున్న రంగా రవీందర్ గుప్తా (బుల్లెట్ రవి).

## గ్రామాల నీటి సమస్యను తీర్చేందుకు కాలువల మరమ్మతులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు గుండాల మండలంలోని రెండు గ్రామాలకు నీటి సమస్యను తీర్చేందుకు యుద్ధ ప్రాతిపదికన కాలువల మరమ్మతు కార్యక్రమాలు ప్రారంభించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు ఈరసరపు యాద గిరి గౌడ్. ఈ సందర్భంగా రైతులు ఫోన్ చేసిన వెంటనే స్పందించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ రైతులకు ధైర్యాన్నిస్తూ రైతు సంక్షేమ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా తోడ్పడుతుందని కరువు మండలంగా గుర్తింపు పొందిన గుండాల మండలాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాయకత్వంలో గుండాల మండలాన్ని సర్వతో ముఖాభివృద్ధి దిశగా ముందుకు కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా రైతుల సమస్య పట్ల తరుతగతిన స్పందించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి గౌడ్ కృషిపట్ల నూనె గూడెం మరియు గంగాపురం రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎద్దడి కాలంలో నీటిని అందించే కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆలేరు ఎమ్మెల్యేకి పార్టీ శ్రేణులు మరియు రైతులు అభినందనలు తెలియజేశారు.

## 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారాలి




**విశ్వంభర, బషీర్ బాగ్:** భారతదేశం ఇండో లాటిన్ – అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో విపివివి టెక్నో కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్. ఒప్పందంపై సంతకాలు చేసాయి. దీని ప్రకారం 2047 నాటికి విక్షిత్ భారత్‌గా మారాలనే లక్ష్యంగా 10 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఎత్తున పెట్టుబడులు పెట్టనుంది. పెద్ద కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, సెమీకండక్టర్ మిషన్, నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్ స్కీమ్, మేక్ ఇన్ ఇండియా మరియు మేడ్ ఫ్రమ్ ఇండియా మరియు అనేక ఇతర కార్యక్రమాలు రక్షణ, అవస్థాపన అభివృద్ధి వైపు దృష్టి సారించాయి. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖకు చెందిన మిస్టర్ టోఖాన్ సాహు, భార త్లో లోని సీషెల్స్ హైకమిషనర్ లలాటియానా అకౌచె, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో హైకమిషనర్ జకారి యా ట్రౌర్తో సహా ప్రపంచ ప్రముఖులతో కలిసి ఒప్పందంపై సంతకాలు చేశారు. మొదటి కౌన్సెలర్, గినియా ఎంబసీ, సెకౌ కాండే, ఎకనామిక్ కౌన్సెలర్, గినియా ఎంబసీ మరియు హెచ్.ఇ. జువాన్ అంగులో, రిపబ్లిక్ ఆఫ్ చిలీ రాయబారి భాగస్వామ్యం అంత ర్జాతీయ ప్రాముఖ్యతను వివరించారు.

## వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి:ఎంపీ కడియం కావ్య





**విశ్వంభర, వరంగల్:** మడికొండ సత్య సాయి కన్వెన్షన్‌లో వరంగల్ అకాడమీ అఫ్ పిడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ అఫ్ పిడియాట్రిక్స్-తెలంగాణ PATS 10వ వార్షిక సమస్య సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని చిన్న పిల్లల వైద్య నిపుణులు అందరూ ఒకే చోట కలిసే ఈ సమావేశానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. శిశువుల్లో అతి ప్రమాదకరమైన వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, పిల్లలలో పోషకార లోపాన్ని తగ్గించే విధంగా సరైన న్యూట్రిషన్ అందించాలని తెలిపారు. మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ముఖ్యంగా మహిళా డాక్టర్స్ పై జరుగుతున్న లైంగిక దాడులకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. దీనిపై హెల్త్ కమిటీ మెంబర్ గా పార్లమెంట్ లో మహిళా డాక్టర్స్ కు రక్షణ కలిపించే విధంగా ప్రత్యేక చట్టాలు రూపొందించే విధంగా చర్చిస్తానని వెల్లడించారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారిని శాలువాతో సత్కరించి మెమోంటో బహుకరించారు. వరంగల్ అకాడమీ అఫ్ పిడియాట్రిక్స్ సభ్యులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు లక్ష్మయ్య




**విశ్వంభర. మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీలో మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జల్లల లక్ష్మయ్య ఆధ్వర్యంలో రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుభరోసా ఎగగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన తెలియజేసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగినది. ఈ సందర్భముగా పార్టీ అధ్యక్షులు లక్ష్మయ్య మాట్లాడుతూ ఎకరానికి 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరుని ఎండగట్టాలనిదయబట్టారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక రైతు భరోసా రైతు బీమా రైతు బంధు ఇవ్వలేక మూసి మసి అని టాపిక్ డైవర్ట్ చేస్తూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లినట్టేనని ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ లోని మారియట్ హోటల్ లో ఆదివారం దుబాయ్ ఎక్స్‌పో జరిగింది. క్రియేటివ్ హోమ్స్ కంపెనీ వారి బ్రోచర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో క్రియేటివ్ హోమ్స్ పార్టనర్ మనీష్ నాగ్‌పాల్, రోహిత్, ప్రాపర్టీ కన్సల్టెంట్ పాల్గొన్నారు.

## పిల్లలను సన్మార్గంలో నడిపించే మార్గదర్శి గురువు



**విశ్వంభర, హన్మకొండ:** రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞత భాషాంజలి సభ కు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హన్మకొండ టిటిడి కళ్యాణ మంటపంలో రాష్ట్ర ప్రభుత్వంభాషోపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞత భాషాంజలి ఆత్మ గౌరవ సభ కు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని సన్మార్గంలో నడిపించే మార్గదర్శి గురువు. తల్లిదండ్రుల తర్వాత అంతటి బాధ్యత చూపే ఆదర్శమూర్తి ఉపాధ్యాయుడు అని తల్లీ తండ్రులు కనిపెంచితే గురువులు పిల్లలకు విద్యాబుద్దులు నేర్పించి వారిని సన్మార్గం నడిపించే భాధ్యత గురువు తీసుకుంటాడు అని తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగిన వెంటనే ప్రజా భవన్ కంచెలు తొలిగించినం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశాం. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించాం. 1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినం పరీక్షలు నిర్వహించిన నియామక పత్రాలు అందించినం గత 10 యేండ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలె పేపర్ లీకేజిలు చేసి విద్యార్థులతో ఆటలు అడుకున్న గత ప్రభుత్వం యువకుల పట్ల ప్రేమ ఒలకపోయడం నీచం మైన బుద్ధి అని నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారు అని వాళ్ళ మాయమాటలు నమ్మద్దు అని మంత్రి వర్యులు సీతక్క అన్నారు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శుభా కాంక్షలు తెలుపుతూ విద్యావేత్తలు ఈ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజా పాలన అందిస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా ఉండాలని సీతక్క అన్నారు అనంతరం పోలోజు శ్రీహరి రచించిన రాష్ట్ర భక్తి గీతాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డితో పాటు ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా అమలు చేయాలి

### ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల రాస్తారోకో

**విశ్వంభర, నల్గొండ:** బి.ఆర్.యస్ పార్టీ నిరసన కార్యక్రమంలోపాల్గొన్న నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎం .సి కోటిరెడ్డి, ఇస్లావత్ రామచంద్రనాయక్ మరియు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు. త్రిపురారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ...రైతు బంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానానికి ఎండగడుతూ త్రిపురారం మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బి.ఆర్.యస్ పార్టీ రైతు నిరసన కార్యక్రమాని నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు యం.సి కోటిరెడ్డి, ఇస్లావత్ రామచంద్రనాయక్, ఇతర మరియు ఇతర బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి త్రిపురారం మండల కేంద్రం ప్రధాన రహదారి సెంటర్లో అ పార్టీ శ్రేణులు రోడ్లపై బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.




## యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్

**విశ్వంభర, హైదరాబాద్:** యూకే ఉన్నత చదువులు చదవాలనుకునే వారికి అద్భుత అవకాశం కల్పిస్తూ గ్లోబల్ నావిగేటర్స్ సంస్థ ఆదివారం యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. యూకే యూనివర్సిటీలో అడ్మిషన్స్ కోసం స్పాట్ అసెస్మెంట్స్, స్కాలర్ షిప్స్, లోన్ అవకాశాలు పొందవచ్చని, పార్ట్ టైం, చదువు తర్వాత ఉద్యోగ సమాచారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. రాజశేఖర్ రెడ్డి, ఎం.డి.ఎం. అమర్ కుమార్ రెడ్డి, సీఈఓ, ఎం. శ్రీనాథ్ రెడ్డి, సీఓఓ పాల్గొన్నారు.



**విశ్వంభర, హన్మకొండ** హన్మకొండ జిల్లా ఈరోజు వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండలం పెరుమాండ్ల గూడెం గ్రామానికి చెందిన నందనం FACS వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్ రావు కోడలు తక్కళ్లపల్లి శ్వేత గారు ఇటివల మరణించగా వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ వీరి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైన మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్




**విశ్వంభర,జగిత్యాల:** తెలంగాణ పోలీస్‌కు సంబంధించి జరిగిన మొట్టమొదటి డ్యూటీ మీటింగు ఎంపికైన జగిత్యాల జిల్లా మేడిపల్లి ఎస్సై తెలంగాణ రాష్ట్రం పోలీస్ నిర్వహించిన మొట్టమొదటి డ్యూటీ మీట్‌కు సంబంధించి మొదటగా జిల్లాస్థాయి ఆతర్వాత జోనల్ స్థాయి జరిగినటువంటి ఎగ్జామ్లలో ప్రతిభ కనబరిచి ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో జరిగినటువంటి డ్యూటీ మీటికీ జోన్ తరపున జగిత్యాల జిల్లా నుండి మేడిపల్లి SI శ్యామ్ రాజ్ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో పాల్గొనడం జరిగింది. ఈ యొక్క డ్యూటీ మీట్ నందు రాష్ట్ర పోలీసులకు Scientific Aids to Investigatation సంబంధించి ఐదు విభాగాలు ఫింగర్ ప్రింట్, హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, క్రిమినల్‌లాకి సంబంధించిన ఎగ్జామ్ లలో జగిత్యాల జిల్లా తరపున పాల్గొన్న ఎస్సై శ్యామ్ రాజ్. జిల్లాస్థాయి అధికారులు అభినందనలు తెలియజేశారు ఈ యొక్క స్టేట్ లెవల్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ గూడ గ్రామంలో నూతనంగా చాయ్ అడ్డ హోటల్ ఓపెనింగ్ చేసిన నిర్వాహకులు ఈ సందర్భంగా చాయ్ అడ్డా యజమాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాగర్ గూడ గ్రామంలో అందరికీ అందుబాటులో సదసమైన ధరలకు స్వచ్ఛమైన టి టిఫిన్స్ అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, లింగం, వెంకట్ రెడ్డి,గ్రామ పెద్దలు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# వయనాడ్‌లో ప్రియాంకకు పోటీగా నవ్య హరిదాస్

▶ యంగ్ లీడర్‌ను బరిలోకి దించుతున్న బీజేపీ



న్యూఢిల్లీ: వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీపై డైనమిక్ లీడర్, రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ నవ్య హరిదాస్‌ను బీజేపీ బరిలోకి దింపింది. దీంతో ఇద్దరు మహిళా నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఈ నేపథ్యంలో అసలెవరా నవ్య హరిదాస్? ఆమె రాజకీయ నేపథ్యం ఏంటి? తదితర వివరాలు తెలుసుకుందాం.

### నవ్య హరిదాస్ నేపథ్యమిదే!

భారతీయ జనతా పార్టీ వయనాడ్ అభ్యర్థిగా నవ్య హరిదాస్(39) పేరును ఖరారు చేయడం వల్ల ఆమె ఎవరు? రాజకీయ ప్రస్థానం ఏంటి? అనే చర్చ నడుస్తోంది. కాలికట్ యూనివర్సిటీలోని కేఎంసీటీ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి బీటెక్ పూర్తి చేశారు నవ్య. ప్రస్తుతం కోజికోడ్ కార్పొరేషన్?లో బీజేపీ కౌన్సిలర్‌గా ఉన్నారు. వరుసగా ఆమెరెండుసార్లు కౌన్సిలర్?గా ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2021లో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కోజికోడ్ సౌత్ నియోజకవర్గం నుంచి ఎన్?డీఏ అభ్యర్థిగా నవ్య హరిదాస్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ దేవర్కోవిల్ చేతిలో ఓడిపోయారు. తాజాగా వయనాడ్ లోక్?సభ ఉప ఎన్నికల బరిలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రకారం నవ్యపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవు.

### 'కాంగ్రెస్‌పై హరిదాస్ పదునైన విమర్శలు

మరోవైపు, వయనాడ్ ఎన్?డీఏ అభ్యర్థిగా తనను ప్రకటించిన గంటల వ్యవధిలోనే నవ్య హరిదాస్ కాంగ్రెస్‌పై పదునైన విమర్శలు గుప్పించారు. గాంధీ కుటుంబం వయనాడ్‌ను కేవలం సెకండ్ ఆప్షన్‌గా పరిగణిస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని వయనాడ్ ప్రజలు గ్రహించారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు తమకు అండగా ఉండి, సమస్యలు పరిష్కరించే నాయకుడినే కోరుకుంటున్నారని తెలిపారు. కోజికోడ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. 'వయనాడ్ సమస్యలను పార్లమెంటులో లేవనెత్తడం వల్ల విఫలమైన గాంధీ కుటుంబానికి ప్రతినిధిగా ప్రియాంక వస్తున్నారు. వయనాడ్ ప్రజలు వచ్చే ఐదేళ్ల పాటు రాహుల్ గాంధీ తమ వెంట ఉంటారనే నమ్మకంతో ఆయనకు ఓట్లేశారు. కానీ రాయబరేలీని ఆయన ఎంచుకుని, వయనాడ్?ను వదిలేశారు' అని నవ్య హరిదాస్ విమర్శించారు.

### రాహుల్ రాజీనామాతో ఉపఎన్నిక

ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్, ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్?బరేలీ స్థానాల నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పోటీ చేశారు. రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. ఆ తరువాత రాయ్‌బరేలీ సీటులో కొనసాగాలని నిర్ణయించుకుని, వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. దాంతో ఆ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి నవం బర్ 13న ఉప ఎన్నిక జరగనుంది. నవంబరు 23న ఫలితం తేలిపోనుంది.

### సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ వ్యూహాలు..

కాగా, వయనాడ్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో తమ పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని బరిలో నిలిపింది. అక్టోబరు 23నయూడీఎఫ్ అభ్యర్థిగా ప్రియాంక నామపత్రాలు దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ప్రియాంకకు పోటీగా బీజేపీ నవ్య హరిదాస్?ను రంగంలోకి దించింది.

## మారథాన్‌లో 2 గంటల్లో 21 కిలోమీటర్లు పరుగెత్తిన సీఎం ఒమర్ అబ్దుల్లా




శ్రీనగర్: జమ్మూకశ్మీర్ లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తొలి మారథాన్‌ను నిర్వహించారు. ఇవాళ ఉదయం జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన.. మారథాన్‌లో పాల్గొన్నారు. రెండు గంటల్లోనే 21 కిలోమీటర్లు పరిగెత్తారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 13 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దాదాపు 2 వేల మంది అథ్లెట్లు.. స్థానికంగా 35 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. కశ్మీర్ లోయలో జరిగిన తొలి అంతర్జాతీయ ఈవెంట్ ఇదే. మారథాన్‌లో చురుకుగా పాల్గొన్న ఒమర్ అబ్దుల్లా అందరి దృష్టిని ఆకర్షించారు. ఎలాంటి శిక్షణ, ప్రణాళిక లేకుండా తాను ఈ మారథాన్‌లో పాల్గొన్నట్లు సీఎం 'ఎక్స్' (ట్విటర్) వేదికగా తన అనుభవాన్ని పంచుకున్నారు.

"నా జీవితంలో 13 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఎప్పుడూ పరిగెత్తలేదు. అది కూడా ఒక్కసారి మాత్రమే. ఈ రోజు చాలామంది మారథాన్‌లో పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహంగా వారితో పాటు ముందుకు సాగాను" అంటూ ఒమర్ అబ్దుల్లా పంచుకున్నారు. భవిష్యత్తులో కశ్మీర్ మారథాన్ ప్రపంచంలోనే అత్యుత్తమ అథ్లెటిక్ ఈవెంట్లలో ఒకటిగా మారుతుందన్నారు. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ–కాంగ్రెస్‌కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే.

## 2028లోపు నేనే సీఎం

### హెచ్.డి.కుమారస్వామి



**బెంగళూరు:** దేవెగౌడ కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామికీలక వ్యాఖ్యలు చేశారు. 2028 లోపు తాను మళ్లీ కర్ణాటక ముఖ్యమంత్రి అవుతానని పేర్కొన్నారు. ప్రస్తుతం కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో నెలకొంటున్న అంతర్గత కలహాల కారణంగా ఈ ప్రభుత్వం పతనమవుతుందని జోస్యం చెప్పారు. ప్రజలు కోరుకుంటే తాను ముఖ్యమంత్రిని అవుతానని.. వారు తనకు మరో అవకాశం ఇస్తారని నమ్ముతున్నానని కుమారస్వామి అన్నారు. 2028లోపు వారి మద్దతుతో సీఎంగా బాధ్యతలు చేపట్టి, మరింత అద్భుతంగా పని చేస్తానని పేర్కొన్నారు. గతంలో కర్ణాటక సీఎంగా తాను చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని.. ఆ పార్టీ ఎమ్మెల్యేలే దానిని పడగొడతారని కుమారస్వామి అన్నారు. "రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు ఎమ్మెల్యేల పట్ల ఆగ్రహంతో ఉన్నారు. దీంతో ప్రభుత్వ నేతల్లో రోజురోజుకు అసంతృప్తి పెరిగిపోతోంది. దీని వల్ల పార్టీకి నష్టం పొంచి ఉంది. ఈ విభేదాలు త్వరలోనే బయటకు వస్తాయి. అప్పటి వరకు వేచి చూడాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. 2006 – 2007, 2018 మే నుంచి 2019 జూలై వరకు కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. ప్రస్తుతం కేంద్ర ఉక్కుశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ

### లాలూ ప్రసాద్ యాదవ్




**రాంచీ:** వచ్చే నెలలో జరగనున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్నామని రాష్ట్రీయ జనతాదళ్ () పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ స్పష్టంచేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 81 స్థానాలకుగాను 70 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ బరిలో దిగుతాయని ఝార్ఖండ్ సీఎం ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. మిత్రపక్షాలను సంప్రదించకుండానే జేఎంఎం, కాంగ్రెస్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. ఝార్ఖండ్‌లోని మొత్తం 81 స్థానాలకుగాను 70 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ బరిలో దిగుతాయని శనివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. మిగతా 11 స్థానాల్లో ఆర్జేడీ, వామపక్షాలు లాంటి ఇతర మిత్రపక్షాలు పోటీపడుతాయని చెప్పారు. అయితే ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారనే విషయాన్ని మిత్రపక్షాలతో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని అన్నారు. గత ఎన్నికల్లో జేఎంఎం 30, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 1 స్థానంలో గెలిచాయి. సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేశాయి. కాగా ఝార్ఖండ్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతోపాటే నవంబర్‌లో పోలింగ్ జరగనుంది. మహారాష్ట్రలోని అన్ని స్థానాలకు ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా.. ఝార్ఖండ్‌లో మాత్రం నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 23న రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

## పాకిస్తాన్ యువతిని పెళ్లాడిన బీజేపీ కార్పొరేటర్ కుమారుడు

**లక్నో :** పాకిస్తాన్‌కు చెందిన ఓ యువతిని బీజేపీ కార్పొరేటర్ కుమారుడు పెళ్లాడాడు. ఆన్‌లైన్ ద్వారా నిఖా నిర్వహించి పెళ్లి తంతును ముగించేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో వెలుగు చూసింది. ఉత్తరప్రదేశ్‌కు బీజేపీ కార్పొరేటర్ తహషీన్ షాహిద్ తన పెద్ద కుమారుడు మహమ్మద్ అబ్బాస్ హైదర్‌కు పాకిస్తాన్ లాహోర్‌లోని అండ్లీప్ జహ్రాతో వివాహం జరిపించారు. అయితే వరుడు పాకిస్తాన్‌కు వెళ్లేందుకు వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తల కారణంగా అతను వీసా పొందలేకపోయాడు. అయితే పెళ్లి కుమార్తె తల్లి రాణా యాస్మిన్ జైదీ తీవ్ర అనారోగ్యం కారణంగా ఐసీయూలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని షాహిద్.. అబ్బాస్, అండ్లీప్ వివాహ వేడుకను ఆన్‌లైన్ నిఖా నిర్వహించి జరిపించారు. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అయితే తన భార్య అండ్లీప్‌కు ఇండియన్ వీసా లభిస్తుందని అబ్బాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీజేపీ ఎమ్మెల్యేపై లైంగికదాడి కేసు

### హైకోర్టు ఆదేశాలతో నమోదు చేసిన పోలీసులు



**గాంధీనగర్:** గుజరాత్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేపై లైంగిక దాడి కేసు నమోదయింది. హైకోర్టు ఆదేశాలతో బీజేపీ ఎమ్మెల్యేపై, మాజీ మంత్రి గజేంద్ర సిన్హ్ పర్మార్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. 2020 జూలై 30న గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌కు తనను పిలిపించుకున్నారని, పెండ్లి చేసుకుంటానని నమ్మబలికి లోబర్చుకున్నారని దళిత బాధితురాలు ఆరోపించింది. ఆ తర్వాత తన ఫోన్‌కాల్స్‌కు ఆయన స్పందించలేదని, తమ మధ్య సంబంధంఉన్న విషయం ఎవరికైనా చెబితే కిడ్నాప్ చేసి, చిత్రహింసలు పెడతానంటూ కులం పేరుతో దూషించారని పేర్కొంది. ఈ మేరకు ఆమె అందజేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోవడంతో 2021లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్మార్‌పై వెంటనే అత్యాచారం కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో గాంధీనగర్ సెక్టార్–21 పోలీస్‌స్టేషన్ పోలీసులు అత్యాచారం, పోక్సో తదితర కేసులు పెట్టారు. ఇప్పటికే అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదయింది. అదేవిధంగా రాజస్థాన్‌లో మైనర్ బాలికను అపహరించిన కేసులో రాజేంద్రసిన్హ్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు2023, ఏప్రిల్‌లో తిరస్కరించింది.

## అసోంలో రూ. 6 కోట్ల విలువ చేసే హెరాయిన్ పట్టివేత



**గువహటి :** అసోంలో భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. మణిపూర్ %–% అసోం సరిహద్దుల మధ్య అసోం పోలీసు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో రూ. 6 కోట్ల విలువ చేసే హెరాయిన్‌నుపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే భారీ మొత్తంలో డ్రగ్స్‌ను తరలిస్తున్నారని అసోం పోలీసులకు సమాచారం అందింది. దీంతో అసోం పోలీసు ఉన్నతాధికారులు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలను అప్రమత్తం చేశారు. మణిపూర్‌లోని కంగ్‌పోక్పి నుంచి అసోంలోని దిగువ రాష్ట్రాలకు మాదక ద్రవ్యాలను తరలిస్తున్నట్లు సమాచారంఅందడంతో.. పోలీసులు నిఘా పెట్టి సీజ్ చేశారు. ఈ హెరాయిన్‌ను గువహటిలోని ముర్తజా అహ్మద్ అలియాస్ భూలుకు వద్దకు తరలిస్తుండగా పట్టుకు న్నట్లు పోలీసులు తెలిపారు. కారులో తరలిస్తున్న 637 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీన్ని 49 సోప్ బాక్సులలో ఉంచి తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ హెరాయిన్ విలువ రూ. 6 కోట్లు ఉంటుందని నార్కోటిక్స్ అధికారులు పేర్కొన్నారు.

## జైల్లో లారెన్స్ బిష్ణోయ్ ఖర్చులకు రూ.40 లక్షలు.. !



**ముంబయి:** మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యతో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రస్తుతం అతడు జైల్లో ఉన్నా అతడి సోదరుడు, అనుచరుడు కెనడా నుంచి వారి గ్యాంగ్‌ను నడిపిస్తున్నారు. అయితే లారెన్స్ బిష్ణోయ్ గురించి అతడి బంధువు రమేష్ బిష్ణోయ్ తాజాగా పలు సంచలన విషయాలు వెల్లడించారు.
పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయవిద్యను పూర్తి చేసిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌స్టర్‌గా మారతాడని తానెప్పుడూ ఊహించలేదని ఆయన పేర్కొన్నారు. జైల్లో ఉన్నప్పటికీ అతడి అవసరాల కోసం బిష్ణోయ్ కుటుంబం సంవత్సరానికి రూ.40 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నట్లుగా రమేష్ బిష్ణోయ్ వెల్లడించారు. "ముందు నుంచి మాది సంపన్న కుటుంబమే. లారెన్స్ తండ్రి హరియాణా పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేసేవారు. వారికి మా గ్రామంలో దాదాపు 110 ఎకరాల భూమి ఉంది. లారెన్స్ ఎప్పుడూ ఖరీదైన దుస్తులు, బూట్లు ధరించేవాడు. ఇప్పుడు కూడా జైల్లో ఉన్న అతడి కోసం మా కుటుంబం సంవత్సరానికి రూ.40 లక్షలు ఖర్చు చేస్తోంది" అని రమేష్ బిష్ణోయ్ పేర్కొన్నారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లా ధత్తరన్‌వాలీ గ్రామంలో జన్మించిన బిష్ణోయ్ అసలు పేరు బాల్కరన్ బ్రార్. పాఠశాలలో చదువుతున్న సమయంలో అతడి పేరును లారెన్స్ బిష్ణోయ్‌గా మార్చుకున్నాడు. అతడు యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడిగా ఉన్న సమయంలోనే పలు అసాంఘిక కార్యకలాపాలు మొదలుపెట్టాడు. డీఏవీ కాలేజీ గ్యాంగ్‌వార్‌లో అతడి ప్రియురాలిని ప్రత్యర్థి వర్గం సజీవ దహనం చేసింది. దీంతో అతడు పూర్తిగా నేరాల వైపు మళ్లినట్లు చెబుతుంటారు. 2018లో తన అనుచరుడు సంపత్ నెహ్రాతో కలిసి సినీ స్టార్ సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్రపన్నడంతో జాతీయ స్థాయిలో వార్తలకెక్కాడు. కొన్నేళ్లుగా లారెన్స్ బిష్ణోయ్ జైల్లోనే ఉంటున్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ పెద్ద పేరు గలిగిన వారిని లక్ష్యంగా చేసుకొని హత్యలకు ప్రణాళికలు రచిస్తుంటాడు. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈ విధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

## మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో మిత్రపక్షాలకు పెద్దపీట!

▶ ఆచితూచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్
▶ తక్కువ సీట్లలోనే పోటీ



ఢిల్లీ: ఇటీవలే జరిగిన హరియాణా, జమ్ముకశ్మీర్ ఎన్నికల్లో దెబ్బతిన్న కాంగ్రెస్, మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటుపై ఆచితూచి వ్యవహరిస్తోంది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు తక్కువ సీట్లలో పోటీకి సిద్ధమవుతోంది. అలాగే బీజేపీని ఢీకొట్టే వ్యూహాలను సిద్ధం చేస్తోంది.

### ఆచితూచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్..

మరోవైపు, మహారాష్ట్రలోనూ మిత్రపక్షాలతో సీట్ల పంపకంపై కాంగ్రెస్ తగ్గినట్లు తెలుస్తోంది. శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రేతో కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర ఎన్నికల ఇన్ ఛార్జ్ రమేశ్ చెన్నితాల ముంబయిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపారు. విదర్భ ప్రాంతంలో కాంగ్రెస్ బలంగా ఉందని, అక్కడ తమకు ఎక్కువ సీట్లను కేటాయించాలని కోరారు. మహారాష్ట్రలో మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు చివరి దశలో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. మరికొద్ది రోజుల్లో కూటమి పార్టీలు పోటీ చేసే స్థానాలను ప్రకటిస్తామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడిగా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఉన్న 288 సీట్లలో గతంలో హస్తం పార్టీ 125 సీట్లు ఆశించింది. అయితే హరియాణా, జమ్ముకశ్మీర్ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం నేపథ్యంలో కాంగ్రెస్ 105–110 సీట్లలో పోటీకి సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మిత్రపక్షాలైన శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ(ఎస్?పీ), సమాజ్ వాదీ పార్టీతో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నాయి. మిత్రపక్షాలకు సానుకూల సంకేతం పంపేందుకు తమ సీట్లను తగ్గించుకున్నామని వెల్లడించాయి. 2019లో జరిగిన ఝార్ఖండ్?లో అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం కూటమితో కలిసి కాంగ్రెస్ బరిలోకి దిగింది. అప్పట్లో కాంగ్రెస్ 31 సీట్లలో తమ అభ్యర్థులను పోటీకి దింపింది. అయితే ఇటీవల కాలంలో తమకు 33 సీట్లను ఇవ్వాలని కోరింది. అయితే తాజాగా మనసు మార్చుకుని, 29 సీట్లకే ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.

### సోరేన్?తో రాహుల్ చర్చలు

కాంగ్రెస్ అగ్రనేత, లోక్?సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం ఝార్ఖండ్?లో పర్యటించారు. ఈ క్రమంలో సీట్ల సర్దుబాటుపై జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ తో చర్చలు జరిపారని తెలుస్తోంది. అలాగే ఆర్?జేడీ నేత తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎంఎల్) నేతలు అరూప్ ఛటర్జీ, బబ్లూ మహతోతో పొత్తుపై హేమంత్ సోరెన్ చర్చించినట్లు కాంగ్రెస్ నాయకుడు ఒకరు తెలిపారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం 43 స్థానాల్లో బరిలోకి దిగగా, తాజాగా మరో రెండు స్థానాలను అదనంగా ఆశిస్తోంది. వాటిని బీజేపీ, ఏజేఎస్?యూ నుంచి జేఎంఎంలో చేరిన కేదార్ హజ్రా, చందన్ కియారీలకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఆర్?జేడీ 2019లో 7 స్థానాల్లో పోటీ చేయగా, తాజా ఎన్నికల్లో 5 సీట్లలో బరిలోకి దిగే అవకాశం ఉంది. అలాగే సీపీఎం(ఎంఎల్) 4 సీట్లు దక్కనున్నాయి.

### 'గిరిజనుల మనోభావాలను బీజేపీ దెబ్బతీసింది'

సీట్ల పంపకం జరగకముందే, సంకీర్ణ ప్రభుత్వ విజయాన్ని ఓటర్లకు వివరించేందుకు కూటమి రంగంలోకి దిగిందని ఏఐసీసీ, ఝార్ఖండ్ ఎన్నికల ఇన్?ఛార్జ్ సప్తగిరి ఉలక చెప్పారు. గత కొన్నాళ్లుగా జేఎంఎం – కాంగ్రెస్ కూటమి పేదలకు అండగా ఉండేం దుకు అనేక చర్యలు తీసుకుందని, వాటిని ప్రచారం చేస్తున్నామని తెలిపారు. అధికార కూటమి ని అస్థిరపరచడం ద్వారా గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నించిందని పేర్కొన్నారు.

### ఫస్ట్ లిస్ట్ రిలీజ్ అప్పుడే!

'అక్టోబర్ 20న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. అప్పుడు 60మంది అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. అదే రోజు కాంగ్రెస్ అభ్యర్థుల ఫస్ట్ రిలీజ్ ప్రకటించొచ్చు. విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో కాంగ్రెస్ బలంగా ఉంది. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుస్తుందని భావిస్తున్నాం. ఇండియా కూటమి పార్టీలన్నీ మహారాష్ట్రలో బీజేపీని ఓడిస్తాయి' అని కాంగ్రెస్ నేత బీఎమ్ సందీప్ ఈటీవీ భారత్‌కు తెలిపారు.

## ఢిల్లీలోని పాఠశాల వద్ద పేలుడు..

ఢిల్లీః ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వెలుపల పేలుడు సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరగ్గా.. వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చెరుకున్నారు. క్రైమ్, ఎఫ్ఎస్ఎల్ బృందాలు, బాంబు డిస్పోజల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. "ఇవాళ ఉదయం 7:47 గంటలకు సీఆర్పీఎఫ్ పాఠశాల సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించినట్లు సమాచారం వచ్చింది. ఈ ఘటనలో పాఠశాల గోడ కూలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు' అని పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేలుడుకు గల కారణాలు తెలియరాలేదని వెల్లడించారు. పేలుడు కారణంగా పాఠశాల సమీపంలో నిలిపి ఉంచిన కార్ల అద్దాలు పగిలిపోవడంతో పాటు ఆ ప్రాంతంలోని దుకాణాలు దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు

విశ్వంభర V3 NEWS

# ఇది అమరావతి పునర్నిర్మాణం కంటే పునరుజ్జీవంగా భావిస్తున్నా

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విశ్వంభర, అమరావతి:** సీఆర్‌డీఏ కార్యాలయ భవన పనులతో ఏపీ రాజధాని నిర్మాణానికి మళ్లీ శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగిన అంశమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రివర్గం, అధికారులు, ప్రజలకు ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఇది అమరావతి పునర్నిర్మాణం కంటే పునరుజ్జీవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజధాని రాష్ట్రానికి మధ్యలో ఉండాలని, అసెంబ్లీ, సీఎం, మంత్రులు, అధికారుల కార్యాలయాలు, కోర్టు భవనాలు.. ఇలా అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని వెంకయ్యనాయుడు అభి.ప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులతో కలిసి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భం మరువలేనిదన్నారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఏపీ రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించి అమరావతిలో సదుపాయాల కల్పనకు రూ. 1000 కోట్లు కేటాయించానని గుర్తుచేసుకున్నారు. మళ్లీరాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించేందుకు ముందుకు రావటం హర్షించదగిన విషయమన్నారు. పట్టు వదలకుండా, బెదరకుండా, అణచివేతలను ఎదుర్కొంటూ అమరావతి రైతులు సాగించిన ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. అమరావతి కోసం సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఏపీ రాజధానిగా అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి రావాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దేశానికి ఆదర్శంగా ముందుకు సాగాలని ఎక్స్‌లో వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

## నేరస్థుడికి మరణ శిక్ష పడేలా చూడాలి: చంద్రబాబు

## బద్వేల్ ఘటనపై తీవ్ర విచారం



**విశ్వంభర, అమరావతి:** వైఎస్ఆర్ జిల్లా బద్వేల్‌లో ప్రేమోన్మాది పెట్రోల్ దాడి ఘటనలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కేసును ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరస్థుడికి మరణశిక్ష స్థాయిలో శిక్ష పడేలా చూడాలని ఆదేశించినట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. "బద్వేల్‌లో యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయడిన ఇంటర్ విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఈ ఘటన నన్ను ఎంతగానో కలచివేసింది. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలి కావడం విచారకరం. నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా అధికారులు తెలిపారు. ఈ కేసులో వేగంగా విచారణ పూర్తి చేసి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఆదేశించాను. బాధిత కుటుంబానికి న్యాయం చేయడం అంటే... హంతకుడిని త్వరగా, చట్టబద్ధంగా, కఠినంగా శిక్షించడమే. అందుకే ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో ఈ కేసు విచారణ పూర్తి చేసి నేరస్థుడికి మరణశిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించాను. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసేవారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు సూచించాను" అని పేర్కొన్నారు.

## నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తాం: హోం మంత్రి అనిత



వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో ప్రేమోన్మాది పెట్రోల్ దాడి ఘటనలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందడం విషాదకర మని ఏపీ హోంమంత్రి అనిత తెలిపారు. బాలికపై దాడి అనంతర దృశ్యాలు తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. పెట్రోల్ పోసి నిప్పంటిం చిన నిందితుడు విఘ్నేష్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు నేతృత్వంలో 4 బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిందితుడు, అతడికి సహకరించిన వారికి కఠిన శిక్ష పడేలా చేస్తామన్నారు. బాధితురాలి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## కృష్ణానది పరీవాహక ప్రజలకు హెచ్చరికలు



**విశ్వంభర, అమరావతి :** ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వస్తున్న వరదలతో ప్రకాశం బ్యారేజ్ నిండుకుండలా మారింది. అధికారులు ముందస్తుగా బ్యారేజ్ 70 గేట్లు ఎత్తి లక్షా 18 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కృష్ణనది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 2.17 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 6 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి,ఎడమ కేంద్రాల ద్వారా 60 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## దివ్వెల మాధురికి తిరుమల పోలీసుల నోటీసులు!



**విశ్వంభర,తిరుమల:** దివ్వెల మాధురికి తిరుమల పోలీసులు షాకిచ్చారు.శ్రీకాకుళం జిల్లా టెక్కలికి వెళ్లి మరీ ఆమెకు 41 ఏ కింద నోటీసులు జారీ చేశారు. విచారణకు తిరుమలకు రావాలని ఆదేశించారు.వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దువ్వెల మాధురితో కలిసి ఇటీవల తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరు మాఢ వీధుల్లో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. తాము సహ జీవనం చేస్తున్నామని, త్వరలోనే పెళ్లి చేసుకుంటామని చెప్పారు. ఇలా పవిత్రమైన మాఢవీధుల్లో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోవడం వివాదాస్పదమైంది.టీటీడీ నియమనిబంధనలు, సంప్రదాయాలనుఉల్లంఘిస్తూ, సోషల్‌మీడియాలో రీల్స్ కోసం వీడియోలు తీసుకుంటూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారంటూ తిరుమల టూటౌన్ పోలీసులకు టీటీడీ విజిలెన్స్ ఏవీఎస్‌వో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ 292, 296, 300 సెక్షన్ 66 – 200 –2008 కింద కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా 41ఏ కింద నోటీసులు జారీ చేశారు.

## 31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం..



**విశ్వంభర, తిరుపతి :** తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 31న 'దీపావళి ఆస్థానాన్ని' నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. దీపావళి నాడు ఉదయం 7 నుంచి ఉదయం 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుందన్నారు. ఆస్థానంలో భాగంగా మలయప్పస్వామి దేవేరులతోకలిసి ఘంటా మండపంలో ఏర్పా టుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారని వివరించారు. సేనాధిపతి అయిన విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారని తెలిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతమలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. దీపావళి ఆస్థానం కారణంగా అక్టోబరు 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తామని వివరించారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆపద మొక్కులవాడు వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులతో 5 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 నుంచి 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. శనివారం స్వామివారిని 80,741 మంది భక్తులు దర్శించుకోగా 31,581 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.45 వచ్చిందన్నారు.

## ఏపీలో ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ

విశ్వంభర, అమరావతి : ఏపీలో త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. కాకినాడ ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్‌ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరబత్తుల రాజశేఖర్, కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా ఆలపాటిరాజేంద్రప్రసాద్ పేర్లను ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

## ఇదేమీ రాజ్యం చంద్రబాబూ.. ఇంటర్ విద్యార్థి హత్యపై మండిపడ్డ జగన్



**విశ్వంభర, అమరావతి:** లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు.. ఇదేమి రాజ్యం చంద్రబాబు అని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ విమర్శించారు. మహిళలకు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు.. ఇదేమి రాజ్యమని మండిపడ్డారు. ప్రతిరోజూ ఏదో చోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బద్వేలులో ఇంటర్ కాలేజీ విద్యార్థినిపై పెట్రోలుపోసి, నిప్పుపెట్టి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గమని అన్నారు. ఇంటర్ విద్యార్థిని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉందని జగన్ ఆరోపించారు. ఒక పాలకుడు ఉన్నాడంటే ప్రజలు ధైర్యంగా ఉండాల్సింది పోయి నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైసీపీ మీద కక్ష కొద్దీ తమ పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రజల మీద కక్ష సాధిస్తున్నారనిచంద్రబాబుపై జగన్ మండిపడ్డారు.ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన విప్లవాత్మక "దిశ" కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనంకాదా అని నిలదీశారు. దీనివల్ల మహిళలు, బాలికల భద్రతను ప్రశ్నార్థకంచేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ' దిశ యాప్‌లో %యూా% బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను ఐదుసార్లు అటూ, ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూంకు, అక్కడనుంచి దగ్గర్లోనే ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది.. ఆ వెంటనే పోలీసులు వారికి ఫోన్‌చేస్తారు. వారు ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్టు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను మీరు ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా?' అని ప్రశ్నించారు దిశ' ప్రారంభం మొదలు 31,607 మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబు అని మండిపడ్డారు. 1.56కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న దిశపై రాజకీయ కక్ష ఎందుకు అని ప్రశ్నించారు.దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబులు ఏర్పాటు చేశామని వైఎస్ జగన్ గుర్తుచేశారు. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూ టర్లను నియమించామని తెలిపారు. 900 బైక్‌లు, 163 బొలేరో వాహ నాలను "దిశ" కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలిం గ్‌ను పటిష్ట పరిచామని పేర్కొన్నారు. 18 "దిశ" పోలీస్ స్టేషన్లను పెట్టి, 18 క్రైమ్ మేనేజ్‌మెంట్ వాహనాలను సమకూర్చామని.. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. మా హయాంలో శాంతిభద్రతలపై నేను చేసిన సమీక్ష సమావేశాలలో "దిశ" కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవాళ్లమని.. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారని అన్నారు. వీటన్నింటినీ నిర్వీర్యం చేసి ఏం సాధించాలనుకుంటున్నారు చంద్రబాబు అని ప్రశ్నించారు. మీరు చేస్తున్నదల్లా మహిళల రక్షణ, సాధికారత కోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీంలను ఎత్తివేసి, ఇప్పుడు ఇసుక, లిక్కర్ లాంటి స్కాంలకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహించడం లాంటివి చేస్తున్నారని అన్నారు. ఇటు పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు పెడుతూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుంది తప్ప మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను పట్టించుకోవడంలేదన్నారు. ఇదేమి రాజ్యం చంద్రబాబు అని మండిపడ్డారు.

## బ్లాక్‌లో తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు

## వైసీపీ ఎమ్మెల్సీపై కేసు నమోదు



**విశ్వంభర, తిరుపతి:** వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానంపై తిరుమలలో కేసు నమోదైంది. సిఫారసు లేఖపై వీఐపీ బ్రేక్‌దర్శనానికి సంబంధించి ఆరు టికెట్లను విక్రయించారని ఓ భక్తుడి ఇచ్చిన ఫిర్యాదుతో తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. బెంగళూరుకు చెందిన సాయికుమార్ అనే వ్యక్తికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అధిక ధరకు విక్రయించారు. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం సిఫారసు లేఖపై అతనికి ఆరు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను అమ్మారు. అయితే ఈ టికెట్ల కోసం రూ. 65వేలు తీసుకున్నారు. దీనిపైనే సాయి కుమార్ అనే వ్యక్తి టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో బ్లాక్‌లో వీఐపీ టికెట్లు విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు టీటీడీ విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏ1గా చంద్ర శేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా ఎమ్మెల్సీ పీఆర్వో కృష్ణతేజ పేర్లను చేర్చారు.తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను బ్లాక్‌లో విక్రయించారని తనపై వచ్చిన ఆరోపణలపై ఎమ్మెల్సీ జకియా ఖానం స్పందించారు. తాను టీడీపీ చేరబో తున్నాని తెలుసుకుని వైసీపీ నేతలు తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. అందులో భాగంగానే తన లెటర్‌ను దుర్వినియోగం చేశారని అన్నారు. తన లెటర్‌ను డబ్బులకు ఇచ్చిన విషయం తెలియదని అన్నారు. పోలీసులు సమాచారం ఇవ్వడం వల్లే ఈ విషయం తనకు తెలిసిందని తెలిపారు. నిజాయితీగా ఉండేవారికి వైసీపీలో గౌరవం లేదని ఆరోపించారు.

## మాకేం సంబంధం లేదన్న బొత్స



తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన టికెట్లను వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానమ్ విక్రయించడం ఏపీలో సంచలనం సృష్టించింది. దీనిపై స్పందించిన జకియా.. తాను టీడీపీలోకి చేరుతున్నానని తెలిసి వైసీపీ నేతలు తనపై కుట్రలు పన్నారని ఆరోపించారు. అయితే ఈ వార్తలను వైసీపీ సీనియర్ నాయకులు బొత్స ఖండించారు. జకియా ఖానమ్‌తో తమపార్టీకి ఎలాంటిసంబంధంలేదని స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానమ్ ఇప్పుడు వైసీపీలో లేరని బొత్స సత్యనారాయణ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆమె టీడీపీలోకి వెళ్లిపోయారని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో ఆమె మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారని చెప్పారు. తిరుమలలో వీఐపీ టికెట్లు ఆమె అమ్ముకున్నట్లు వచ్చిన ఆరోపణలతో తమకేమీ సంబంధం లేదని స్పష్టం చేశారు.బెంగళూరుకు చెందిన సాయికుమార్ అనే వ్యక్తికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అధిక ధరకు విక్రయించారు. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం సిఫారసు లేఖపై అతనికి ఆరు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను అమ్మారు. అయితే ఈ టికెట్ల కోసం రూ. 65వేలు తీసుకున్నారు. దీనిపైనే సాయికుమార్ అనే వ్యక్తి టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో బ్లాక్‌లో వీఐపీ టికెట్లు విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు టీటీడీ విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏ1గా జకియా పీఏ చంద్రశేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా ఎమ్మెల్సీ పీఆర్వో కృష్ణతేజ పేర్లను చేర్చారు.తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను బ్లాక్‌లో విక్రయించారని తనపై వచ్చిన ఆరోపణలపై ఎమ్మెల్సీ జకియా ఖానం స్పందించారు. తాను టీడీపీ చేరబోతున్నాని తెలుసుకుని వైసీపీ నేతలు తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. అందులో భాగంగానే తన లెటర్‌ను దుర్వినియోగం చేశారని అన్నారు. తన లెటర్‌ను డబ్బులకు ఇచ్చిన విషయం తెలియదని అన్నారు. పోలీసులు సమాచారం ఇవ్వడం వల్లే ఈ విషయం తనకు తెలిసిందని తెలిపారు. నిజాయితీగా ఉండేవారికి వైసీపీలో గౌరవం లేదని ఆరోపించారు.

## వంతెనపై రెండు కార్లు ఢీ.. ఇద్దరి మృతి

విశ్వంభర, అమరావతి : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. విజయవాడ-హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై ఇటీవల వచ్చిన వరదలకు గరికపాడు వంతెన దెబ్బతింది. దీంతో పోలీసులు వన్‌వేను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎదురెదురుగా వేగంగా వచ్చిన రెండు కార్లు ఢీ కొన్నాయి. కారులో ఉన్న ఇద్దరు మృతి చెందగా మరి కొందరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు.

## విద్యుత్ షాక్‌కు గురై తల్లీకొడుకుల మృతి!

**విశ్వంభర,సామర్లకోట:** విద్యుత్ షాక్‌తో గంటలవ్యవధిలోనే తల్లీ కొడుకు ప్రాణా లు కోల్పోయారు. ఈ ఘటన కాకినాడ జిల్లా సామర్లకోటలోని 20వ వార్డులో జరిగింది. స్థానిక వీర రాఘవపురం సత్తమ్మతల్లి గుడి సమీపంలో నివసిస్తున్న చిట్టిమని పద్మ (40) శనివారం ఇంటి పక్కన ఉన్న కాల్వలోకి తుళ్లిపడి మృతి చెందారు. ఆదివారం ఆమె కుమారుడు విశ్వేస్ (23) కూడా అక్కడే దుస్తులు ఆరేసే తీగను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. దీంతో పద్మకూడా విద్యుత్ షాక్ గురై మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గంటల వ్యవధిలోనే తల్లీ కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతం లో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ధర్మవరంలో కాల్పుల కలకలం

**విశ్వంభర, ధర్మవరం:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో కాల్పుల కలకలం రేగింది. బత్తలపల్లి మండలం రామాపురం హైవేపై రెండు బైక్‌లపై వెళ్తున్న నలుగురు దొంగలను లొకేషన్ ఆధారంగా రెండు కార్లలో వచ్చిన తెలంగాణ పోలీసులు వెంబడించారు. రామాపురం క్రాస్ వద్ద తప్పించుకుని మరో మార్గంలోకి దొంగలు వెళ్తుండటంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఒకరు పట్టుబడగా.. మిగతా ముగ్గురు పరారయ్యారు.కాల్పుల విష యంలో తొలుత కొంత గందరగోళం నెలకొంది. పోలీసులు, దొంగలు ఎక్కడివారో స్థానికులకు తొలుత అర్థం కాలేదు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు విచారించగా.. తెలంగాణలో జరిగిన ఓ మోసం కేసుకు సంబంధించిన నిందితులను ఆ రాష్ట్ర పోలీసులు వెంబడించినట్లు వెల్లడైంది.

# ‘నరుడి బ్రతుకు నటన’ చిత్రాన్ని సక్సెస్ చేయండి

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సుధీర్ బాబు



శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం ‘నరుడి బ్రతుకు నటన’. శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర ప్రముఖ తారాగణంతో రాబోతోన్న ఈ చిత్రానికి రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు. టీజీ విశ్వ ప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు రెడ్డి ఈ సినిమాను నిర్మించగా.. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవరించారు. సుధీర్ కుమార్ ప్రాజెక్ట్ హెడ్. ఈ మూవీ అక్టోబర్ 25న రాబోతోంది. ఈ క్రమంలో శనివారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు సుధీర్ బాబు, దర్శకులు వీరశంకర్, వీజే సన్నీ, శ్రీరామ్ ఆదిత్య, వితిక షెరు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం.. సుధీర్ బాబు మాట్లాడుతూ.. ‘టీజీ విశ్వ ప్రసాద్ ను పదేళ్ల క్రితం కలిశాను. ఆయన అప్పటికి ఇంకా ఇండస్ట్రీలోకి రాలేదు. ఆయనకు సినిమాలంటే ప్యాషన్. ఈ మూవీ ట్రైలర్ చూశాను. శివ, నితిన్ ప్రసన్న ఎంతో ఇంటెన్స్‌గా నటించారు. నా చిత్రంలో ఏదైనా మంచి పాత్రలుంటే వారినే రిఫర్ చేయాలని అనుకుంటున్నాను. రిషి ఈ మూవీని అద్భుతంగా తీశాడు. నేను కృష్ణవంశీ చిత్రానికి, బాఫీ చిత్రాలకు ఆడిషన్స్ చేశాను. పెద్ద సినిమాలే కాదు.. చిన్న చిత్రాలు, మీడియం చిత్రాలే ఇండస్ట్రీని నడిపిస్తాయి. ఈ మూవీ చాలా కొత్తగా, రీఫ్రెషింగ్‌గా ఉండబోతోందనిపిస్తోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి’ అని అన్నారు.

టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. ‘ప్యాషన్, డబ్బులుంటే సినిమాల్ని తీయలేం. నేను ప్రారంభంలో కొన్ని చిత్రాలను నిర్మించాను. అవి ఇంటర్నేషనల్ స్టేజ్ మీద ప్రదర్శించగలిగాను. కానీ థియేట్రికల్ రిలీజ్ చేయలేకపోయాను. ఈ ‘నరుడి బ్రతుకు నటన’ టీంని చూసినప్పుడు నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. అందుకే వారికి సాయం చేయాలని ముందుకు వచ్చాను. అందరూ చూసి టీంను సపోర్ట్ చేయండి’ అని అన్నారు.

**డైరెక్టర్ రిషికేశ్వర్ యోగి మాట్లాడుతూ..** ‘మా సినిమాను టేకప్ చేసిన టీజీ విశ్వ ప్రసాద్ కు థాంక్స్. మా ఈవెంట్‌కు వచ్చిన సుదీర్ బాబుకు, శ్రీరామ్ ఆదిత్యకు థాంక్స్. శివ, నితిన్ వంటి యాక్టర్లు లేకపోయి ఉంటే.. ఈ సినిమా ఇంత బాగా వచ్చేది కాదు. నాకు సపోర్ట్ చేసిన మా టెక్నికల్ టీంకు థాంక్స్. అందరూ చూడండి’ అని అన్నారు.

**శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ..** ‘శివ, నితిన్‌లు చక్కగా నటించారు. ట్రైలర్ చూశా. నాకు చాలా నచ్చింది. అందరూ ఇంటెన్స్‌గా నటించారు. విశ్వ ప్రసాద్ ఈ ప్రాజెక్ట్‌ను టేకప్ చేశారు. అక్కడే ఈ మూవీ సక్సెస్ అయినట్టు అనిపిస్తుంది. వర్షం పడితే వచ్చే మట్టి వాసనలా ఈ సినిమా అనిపిస్తోంది. అందరూ ఈ సినిమాను కచ్చితంగా చూడండి’ అని అన్నారు.

**వీజే సన్నీ మాట్లాడుతూ..** ‘ట్రైలర్ చూశాను. చాలా బాగా నచ్చింది. కొత్త వాళ్లు చేసిన ఈ ప్రయోగాన్ని అందరూ ఆదరించాలి. ఇలాంటి చిత్రాలను ఆడియెన్స్ ఆదరించినప్పుడు ఇంకా కొత్త ప్రయోగాలు చేసేందుకు అందరూ ముందుకు వస్తుంటారు. టీజీ విశ్వ ప్రసాద్ వంటి వారు ఇలాంటి ఓ డిఫరెంట్ మూవీని ఎంచుకుని, సాయం చేయడం ఆనందంగా ఉంది. అందరూ చూడండి’ అని అన్నారు.

**శివ కుమార్ రామచంద్రవరపు మాట్లాడుతూ..** ‘నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. సినిమా చాలా బాగా వచ్చింది. అన్నీ పరిస్థితులు అనుకూలిస్తే.. నేషనల్ అవార్డు కూడా వస్తుంది. మొదట్లో చిన్న చిత్రంగా స్టార్ట్ అయింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వ ప్రసాద్ రాకతో రూపురేఖలు మారిపోయాయి. మీతో పాటుగా నన్ను, నితిన్‌ను ఇంటికి తీసుకెళ్తారు’ అని అన్నారు.

**నితిన్ ప్రసన్న మాట్లాడుతూ..** ‘మేం మా దర్శకుడు రిషిని నమ్మి ఈ ప్రాజెక్ట్‌ని చేశాం. షార్ట్ ఫిల్మ్స్ చేసే టైం నుంచి రిషి నాకు తెలుసు. ఈ మూవీ చిన్నగా స్టార్ట్ అయింది. ఏ రోజు జరిగిన షూట్‌ని ఆ రోజే ఎడిట్ చేసి మాకు చూపించేవాడు. ఆయన చాలా టాలెంటెడ్. కంటెంట్‌ను నమ్మి మా నిర్మాతలు చిత్రాన్ని నిర్మించారు. విశ్వ ప్రసాద్ గారి రాకతో ఈ ప్రాజెక్ట్ స్థాయి పెరిగింది. ప్రీమియర్లలో మాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. యూనివర్సల్ సబ్జెక్టు కావడంతో అందరికీ నచ్చుతుంది. అక్టోబర్ 25న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి’ అని అన్నారు.

**నిర్మాత డా. సింధు రెడ్డి మాట్లాడుతూ..** ‘మా సినిమాను ప్రెజెంట్ చేస్తున్న విశ్వ ప్రసాద్ కు థాంక్స్. మా మూవీ ఈవెంట్‌కు గెస్టుగా వచ్చిన సుధీర్ బాబుకు థాంక్స్. రిషికి మంచి టాలెంట్ ఉంది. శివ చక్కగా నటించాడు. ఈ చిత్రం చాలా బాగా వచ్చింది. ఈ మూవీని చూసి కంటెంట్ నచ్చి విశ్వ ప్రసాద్ ముందుకు వచ్చారు. మేం ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తీశాం. మాకు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ హెల్ప్ దొరికింది. అందుకే ఇక్కడి వరకు వచ్చాం. అందరూ చూడండి’ అని అన్నారు.

# శ్రమైక్య సౌందర్యం టీఎఫ్టీయూ లక్ష్యం

2013 అక్టోబర్ 20 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణ కార్మిక వర్గం సబ్బండ వర్గాలతో తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకుంటున్న దశ. అప్పటికే అనేక రంగాల కార్మికులు విడివిడిగా తెలంగాణ రాష్ట్రం సాధన కోసం తమ తమ పద్ధతులలో పోరాటాలు, నిరసనలు తెలియజేశారు. ఉద్యమం ఉధృతం అయింది. విద్యార్థులు, యువకులు ఆత్మబలిదానాలు చేస్తున్నారు.. రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా తెలంగాణ సమాజం అలలు అలలుగా కదలిని ఉదృతం చేస్తున్న వేళ అది. నీళ్లు, నిధులు, నియామకాలు సమష్టి లక్ష్యంగా ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ భాషా సంస్కృతి ఆత్మాభిమానం కూడా కీలకంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంలోనే ప్రతి సామాజిక వర్గం తెలంగాణ రాష్ట్రంలో తమ భవిష్యత్తు ఏంటని ప్రశ్నిస్తున్న దశది. కార్మిక వర్గం విషయానికి వస్తే నిర్దిష్టంగా తమ లక్ష్యాలు ఉద్యమం ముందు పెట్టి భాగస్వాములు కావడం కాకుండా తెలంగాణ కోసం ఉద్యమిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో కొందరు ప్రజాస్వామిక తెలంగాణ అని, ఇంకొందరు బంగారు తెలంగాణ అని, ఇంకొందరు బహుజన తెలంగాణ అని తమ తమ లక్ష్యాలను, ఆకాంక్షలను తెలంగాణ సమాజం ముందు పెడుతున్నారు. కానీ తెలంగాణ సమాజంలో 1/ 3వ వంతు ఉన్న శ్రామిక వర్గం తమ ఆకాంక్షలను, లక్ష్యాలను తెలంగాణ సమాజం ముందు పెట్టకుండానే పోరాటాలను, త్యాగాలను కొనసాగిస్తుంది. ఈ సందర్భంలోనే సిఐటియు లో పనిచేస్తున్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నాయకత్వం తెలంగాణకు మద్దతుగా రాజకీయాల కతీతంగా కార్మిక ఉద్యమం కొనసాగాలని భావించి సీఐటీయూ నుండి బయటకు వచ్చారు. 2013 ఫిబ్రవరి 21న మహబూబ్ నగర్ పట్టణం తెలంగాణ చౌరస్తాలో వేలాది కార్మికులతో శ్రమైక్య సౌందర్య తెలంగాణ కోసం గొప్ప సభను నిర్వహించారు. ఈ సభకు నాటి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహిస్తున్న ప్రో,కోదండరాం, ఈటల రాజేందర్ , శ్రీనివాస్ గౌడ్ , జూపల్లి కృష్ణారావు , కాచం సత్యనారాయణ , ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా వరకే నిర్మాణం ఉంటే రాష్ట్రవ్యాపితా ప్రభావితం చేయడం సాధ్యపడదు. తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య టీఎఫ్టీయూ రాష్ట్రస్థాయిలో

TFTU
తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య

నిర్మాణం చేస్తె బాగుంటుందని అప్పటికే తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహిస్తున్న కాచం సత్యనారాయణ అభిప్రాయాన్ని తెలిపారు. ఈ అభిప్రాయాన్ని ఉమ్మడి జిల్లాలోని నాయకత్వం అంతా అంగీకరించి రాష్ట్రస్థాయి నిర్మాణం కొరకు 20 అక్టోబర్ 2013లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వందలాది మంది కార్మిక ప్రతినిధులతో టీఎఫ్ టీయూ ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సభలో సుమారుగా 32 యూనియన్లు పాల్గొన్నాయి.13 యూనియన్లు రాష్ట్ర వ్యాప్త స్వభావం కలిగినవి,మిగిలినవి స్థానిక, జిల్లాస్థాయి, మండల స్థాయి అసంఘటిత రంగ యూనియన్ల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. 2014 జూన్ లో రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత తెలంగాణ ప్రాంతంలోని అనేక రంగాల కార్మికుల కొరకు సమరశీల ఐక్య పోరాటాన్ని నిర్వహించారు. టీఎఫ్టీయూ నాయకత్వంలో జరిగిన పోరాటాలు కొన్ని విజయాలు సాధించాయి.ఇంకొన్ని పాక్షిక విజయాలు సాధించాయి. ఇప్పటికే అనేక రంగాల కార్మికులతో ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్నాము. రాష్ట్ర ఉద్యమానికి కాచం సత్యనారాయణ అధ్యక్షత వహిస్తున్నారు. మహమ్మద్ ఖలీల్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో పి.విజయకుమార్, పి.యాదగిరి, కొండపల్లి శ్రీనివాసరావు, జి గట్టన్న, బి గంగన్న, ఎన్. గోవిందు, రమేష్, సాగర్,తదితరులు నాయకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. లాలా లజపతిరాయ్, శంకర్ గుహ నియోగి, దత్త సామాన్ లాంటి అమర కార్మిక వీరుల స్ఫూర్తితో టీఎఫ్ టీయూ ముందుకెళ్తుంది. వలస కార్మికుల సమస్యలపై, బీడీ కార్మిక సమస్యలపై, పాఠశాలలో పనిచేసే స్వీపర్ల సమస్యపై, వీఆర్ఏల సమస్యపై మహిళా సమాఖ్య వివోఏ ల సమస్యలపై, భవన నిర్మాణ కార్మికులు, మాలి కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, ఆర్డబ్ల్యూఎస్ కాంట్రాక్టు ఆర్టీసీ కాంట్రాక్ట్, బొగ్గు ఉత్పత్తి దారులు, స్కోప్ వర్కర్స్, గ్లాస్ వర్కర్స్,అనేక రంగాల కార్మికులను ఐక్యం చేయడంలో వారు పోరాటాలు నిర్వహించడంలో టీఎఫ్టీయూ కీలకపాత్ర వహించింది. కార్మిక సమస్యల పరిష్కారం కొరకే కాకుండా సామాజిక, స్థానిక సమస్యల పరిష్కారం కొరకు కూడా అనేక పోరాటాల నిర్వహించింది.మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, ఆదివాసి దళిత,మైనార్టీల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం, పేదల ఇళ్ల స్థలాల ఉద్యమం, గ్రామీణ రవాణా సౌకర్యాల కోసం పోరాటాలు నిర్వహించింది. ఇథనాల్ కాలుష్యకారక పరిశ్రమలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి యాదగిరి అరెస్టయ్యారు. మహబూబ్‌నగర్ పట్టణంలో రాజకీయ ప్రమేయంతో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తుంటే ఆ ప్రజల వైపు నిలబడి పోరాటం చేశారు. ఈ క్రమంలో అప్పటి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రికి కంటగింపు అయ్యింది.అనేకమంది నాయకులు వ్యక్తిగత ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడింది. అనేక సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కాకుండా దయనీయంగా జీవిస్తున్న పాఠశాల స్వీపర్ల పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారు. రెగ్యులర్ కాగా మిగిలిపోయిన వీఆర్ఏల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వంతో సంప్రదించడము, తదనుగుణంగా పోరాట రూపాన్ని రూపొందించడం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పది సంవత్సరాలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.ప్రజా పాలన అనే నినాదం తో పని చేస్తుంది.ప్రజా పాలనలో కార్మికుల జీతాల్లో మార్పు వస్తుందా? అనే ప్రశ్న టీ ఎఫ్టీయూ బలంగా వినిపిస్తోంది. రావాలని అంతకంటే బలంగా కోరుకుంటోంది. కార్మికుల ప్రయోజనమే టీఎఫ్టీయూ లక్ష్యం.

## శంకర ఐ హాస్పిటల్స్, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ‘మా’ సభ్యులకు ఫ్రీ ఐ హెల్త్ చెకప్




శంకర ఐ హాస్పిటల్స్, ఫినిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘మా’ సభ్యులందరికీ ఫ్రీ ఐ హెల్త్ చెకప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మా అధ్యక్షుడు విష్ణు మంచు, వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ట్రెజరర్ శివ బాలాజీ పాల్గొన్నారు. ఈ ఫ్రీ ఐ హెల్త్ క్యాంప్‌లో మా సభ్యులందరూ పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మీడియాతో.. విష్ణు మంచు మాట్లాడుతూ.. ‘హెల్త్ క్యాంప్ నిర్వహించిన శంకర ఐ హాస్పిటల్స్, ఫినిక్స్ ఫౌండేషన్‌లకు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకుని విజయవంతం చేసిన మా సభ్యులకు అభినందనలు. పద్మశ్రీ డా. రమణి గురించి మేం విన్నాం. భారతదేశం అంతా కూడా ఫ్రీగా ఐ హాస్పిటల్స్ నిర్వహిస్తున్నారు. కుడిచేత్తో చేసే దానం ఎడమ చేతికి కూడా తెలియకూడదని అంటుంటారు. ఫీనిక్స్ సంస్థ, శంకర హాస్పిటల్స్ కూడా అదే చేస్తోంది. కంచి కామ కోటి మఠ పీఠాదిపతుల్ని మేం ఆరాధిస్తుంటాం. వాళ్ల ఆశీస్సులతో ఈ హాస్పిటల్స్ నడుస్తుండటం ఆనందంగా ఉంది. ’ అని అన్నారు. మాదాల రవి మాట్లాడుతూ.. ‘ఫినిక్స్ సంస్థ నుంచి చుక్కపల్లి సురేష్ , చుక్కపల్లి అవినాష్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. శంకర ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రీ ఐ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించడం ఆనందంగా ఉంది. దీనికి సహకరించిన ఫీనిక్స్ సంస్థ నీలేష్ జానీ గారికి థాంక్స్. మా సభ్యులందరికీ ఫ్రీ చెకప్ చేసిన శంకర ఐ హాస్పిటల్ హెడ్ విశ్వ మోహన్ గారికి కృతజ్ఞతలు’ అని అన్నారు. శివ బాలాజి మాట్లాడుతూ.. ‘అందరూ కంటి సమస్యల గురించి పట్టించుకోరు. ఇలా మా సభ్యులందరికీ ఫ్రీ ఐ హెల్త్ చెకప్ చేయించడం ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు 25 లక్షల మందికి ఫ్రీ ఆపరేషన్స్ చేయించారని తెలిసింది. ఇది చాలా గొప్ప విషయం. ఇప్పుడు మేం అంతా కలిసి మీకు ఫ్రీగా ప్రచారం చేస్తామ’ని అన్నారు. ఫీనిక్స్ సంస్థ డైరెక్టర్ నీలేష్ జానీ మాట్లాడుతూ.. ‘మేం సాధ్యమైనంత వరకు బ్లైండ్ నెస్‌ను నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నాం. ‘మా’తో అసోసియేట్ అవ్వడం వల్ల మేం మరింతగా జనాలకు రీచ్ అవుతామని అనుకుంటున్నామ’ని అన్నారు. శంకర హాస్పిటల్ హెడ్ విశ్వ మోహన్ మాట్లాడుతూ.. ‘సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. ముందుగానే గుర్తించి కంటి సమస్యలను తొలగించుకోవాలి. మా సభ్యులతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది’ అని అన్నారు.

## ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’

# నుంచి హే తారా పాట విడుదల



నిఖిల్ సిద్ధార్థ్, సుధీర్ వర్మ, ఎస్.వి.సి.సి ప్రొడక్షన్స్ చిత్రం ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ నుంచి ‘హే తారా’ అంటూ సాగే పాట విడుదల అయింది. కార్తికేయ 2 చిత్రంతో నేషనల్ రేంజ్ పాపులారిటీని సంపాదించుకున్న హీరో నిఖిల్ ప్రస్తుతం ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. స్వామి రారా, కేశవ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత సుధీర్ వర్మ, నిఖిల్ కాంబోలో రాబోతున్న సినిమా కావటంతో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో కన్నడ క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటించారు. మరో బ్యూటీ డాల్ దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలో నటించగా.. హర్ష చెముడు ముఖ్య పాత్రను పోషించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, ఎల్ఎల్‌పి బ్యానర్‌పై ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించిన సీనియర్ నిర్మాత బి.వి.ఎస్. ఎన్.ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. యోగేష్ సుధాకర్, సునీల్ షా, రాజా సుబ్రమణ్యం ఈ సినిమాకు కో ప్రొడ్యూసర్స్. బాపినీడు.బి ఈ చిత్రానికి సమర్పణ. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మెలోడియస్ గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. కార్తీక్ స్వరపరిచిన ఈ బాణీకి కృష్ణ చైతన్య సాహిత్యాన్ని అందించారు. కార్తీక్, నిత్యశ్రీల గాత్రంలో ఈ పాట ఎంతో వినసొంపుగా శ్రోతలకు హాయినిచ్చేలా ఉంది. హీరో హీరోయిన్ మధ్య ప్రేమ, కెమిస్ట్రీని తెలిపేలా ఈ పాట సాగింది. మనోహరమైన సాహిత్యం హృద్యమైన ట్యూన్‌ని కలిగి ఉన్న ఈ మెలోడీతో ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ప్రేమలో పడతారనిపిస్తోంది. సింగర్ కార్తీక్ ఈ చిత్రానికి సంగీతాన్ని.. సన్నీ ఎం.ఆర్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను అందిస్తున్నారు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళి సందర్భంగా నవంబర్ 8న ‘అప్పుడో ఇప్పుడో ఎప్పుడో’ చిత్రం గ్రాండ్ రిలీజ్ అవుతుంది.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

STUDENT VISA ASSISTANCE
BP TECH INDIA, USA
Training By Real Time Experience
Hands on Based Training
Job Assistance
Personality Development
.NET
Java
python
DevOps
Power BI
Selenium
SOFTWARE TESTING
aws
FIRST TIME IN NAGOLE
Address: Plot No.63P % 62 (NP) 2nd Floor, Samatha Nagar, Nagole X Road, Hyderabad - 500 068.
bptechindiapvtltd@gmail.com
www.bptechllc.in
+91 70955 35566









# అమెరికాలో గణనీయంగా పెరిగిన ఓటర్లు

- గత ఎన్నికలతో పోల్చుకుంటే అధికం
- పెరుగుతున్న యువ ఓటర్లు
- ఈ ఎన్నికల్లో ఓటేయనున్న 24 కోట్ల మంది



**వాషింగ్టన్:** అమెరికాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో దాదాపు 244 మిలియన్ల మంది ఓటు వేయనున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్ల సంఖ్య పెరిగినట్లు సర్వేలు చెబుతున్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల్లో 59 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ప్యూ రీసెర్చ్ సెంటర్ వెల్లడించింది. 2020 ఎన్నికల్లో 66 శాతం మంది ఓటేసినట్లు పేర్కొంది. 1900 తర్వాత ఇదే అత్యధికమని తెలిపింది. 2016 నుంచి 2020 ఎన్నికల్లో యువ ఓటర్ల సంఖ్య పెరుగుతున్నట్లు ఓ అధ్యయన సంస్థ పేర్కొంది. 2016లో 18 నుంచి 29 ఏళ్లు వయస్సు యువత 39శాతం ఓటు వేసినట్లు తెలిపింది. 2020 ఎన్నికల్లో వారి శాతం 50 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దాదాపు 60 శాతం యువ ఓటర్లు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌కు ఓటు వేసినట్లు సర్వేలు తెలిపాయి. 36 శాతం మంది మాత్రమే మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు ఓటేసినట్లు వెల్లడించాయి. 30 నుంచి 44 ఏళ్ల వయసు వారిలో 52 శాతానికిపైగా బైడెన్ వైపు మొగ్గుచూపారు. 65 ఏళ్లు దాటినవారిలో 62 శాతం ట్రంప్‌నకు మద్దతు తెలిపారు. 2023లో ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన సర్వేలో 18 నుంచి 24 ఏళ్ల యువ ఓటర్లలో 66 శాతం మంది డెమోక్రటిక్ పార్టీకి మద్దతిస్తున్నట్లు తేలింది. 25 నుంచి 29 ఏళ్ల వయస్సు ఓటర్లలో 64 శాతం మంది డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు సర్వే వెల్లడించింది. మొత్తంగా యువ ఓటర్లలో 55 శాతం డెమోక్రటిక్ వైపు ఉండగా 42 శాతం రిపబ్లికన్ల వైపు ఉన్నట్లు తెలిపింది. 80ఏళ్లు పైబడినవారిలో 58 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతివ్వగా 39 శాతం డెమోక్రటిక్ పార్టీ వైపు నిలిచినట్లు సర్వేలో వెల్లడైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జాతి అనేది ప్రధానాంశంగా మారింది. జాతుల మధ్య అసమానతలు ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతాయని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. 2020 ఎన్నికల్లో 71 శాతం మంది శ్వేత జాతీయులు ఓటు హక్కు వినియోగించుకోగా, 58.4 శాతం శ్వేత జాతీయులు కానీవారు ఓటు వేసినట్లు బ్రెన్నాన్ సెంటర్ ఫర్ జస్టిస్ లా అండ్ పాలసీ సంస్థ పేర్కొంది. వారిలో 62.6 శాతం మంది నల్లజాతీయ అమెరికన్లు ఉండగా, 53.7 శాతం లాటిన్ అమెరికన్లు, 59.7 శాతం ఆసియా అమెరికన్లు ఉన్నట్లు తెలిపింది. గత కొన్నేళ్లుగా అమెరికాలో అనేక రాష్ట్రాలు ఓటు నమోదును కష్టతరం చేశాయని వెల్లడించింది. ప్రధానంగా రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు మరింత కఠినంగా అమలు చేసినట్లు చెప్పింది. నల్లజాతి అమెరికన్లలో ఎక్కువ శాతం మంది డెమోక్రటిక్ పార్టీకి మద్దతు ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి.
















Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com